హనీబీఎపి

జనవరి - మార్చి 2010

# పల్లెసృజన

సంపుటి 4, సంచిక 3

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక






## పల్లెజ్ఞానాన్ని వ్యాపింపజేద్దాం - 'పల్లెసృజన'ను బహూకరిద్దాం

మీవాళ్ళకు మీరిచ్చే అత్యుత్తమ బహుమతి 'పల్లెసృజన'

# 'హనీబీఏపి' ప్రగతి



'హనీబీఏపి' ఒక స్వచ్ఛంద సంస్థ, హనీబీ నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతం చేయడమే దీని ఉద్దేశ్యం. ఎన్.ఐ.ఎఫ్. సంస్థకు, ఆధ్రప్రదేశ్‌లోని మారుమూల పల్లెల్లోని గ్రామీణ శాస్త్రవేత్తలతో సంధానం చేయడం ఈ సంస్థ మూల కార్యక్రమం.

నవంబర్ 2005 లో బ్రిగేడియర్ గణేశం, డా. కె.యల్. రావు, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ గార్ల సంకల్పమే ఈ సంస్థకు జన్మనిచ్చింది. 2007లో శ్రీ జాగర్లమూడి దుర్గాప్రసాద్ గారు హనీబీఏపిలో చేరడంలో ఉద్యమ ప్రగతి మరింత ఊపునందుకొంది. ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారిని ఆదర్శంగా తీసుకుని వారి మహత్తర జ్ఞాన ఉద్యమాన్ని తెలుగునాట విస్తృతం చేసి, తెలుగు జాతి సృజనాత్మక శక్తిని దేశమంతా చాటి చెప్పాలనే ఆరాటంతో ప్రారంభమై 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా పెరుగుతున్నది. స్వచ్ఛందంగా ఎంతో మంది చేతులు కలిపారు. పెద్దలు ఆశీర్వదించారు. అధికారులు చేయూతనిచ్చారు. అధికార, అనధికార సంస్థలు, వ్యక్తులు శాయశక్తులా తోడిచ్చారు. పత్రికలు, టీవీలు తగినంత కవరేజ్‌ని అందించాయి. అందరితోడు, శుభాకాంక్షలు ఈ స్వల్ప కాలంలో 'హనీబీఏపి' పునాదులను పటిష్టం చేశాయి.

**ఇంతవరకు హనీబీఏపి చేపట్టి సాధించిన వివిధ కార్యక్రమాలు:**

✤ 74 మంది తెలుగు ఇన్నోవేటర్లను వెతికి, వెలుగులోకి తెచ్చి, వారి ఆవిష్కరణలను, ఆలోచనలను ఎన్ఐఎఫ్‌లో రిజిష్టర్‌లో చేయడం జరిగింది.

✤ నలుగురు ఇన్నోవేటర్ల ఆవిష్కరణలను పారిశ్రామిక వేత్తలకు అందించి, ఆర్థిక ఒప్పందం కుదుర్చడమైనది.

✤ ఒక ఆవిష్కరణ కార్యరూపం దాల్చుటకు, టెస్టింగ్‌కు టి.ఐ.పి.పి. ద్వారా నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయం.

✤ కారంచేడులో జరిగిన జాతీయ గ్రామీణ ప్రగతి ప్రదర్శనలో 28 మంది ఇన్నోవేటర్లు పాల్గొని విజయవంతం చేశారు.

✤ ఇప్పటి వరకు 12 కళాశాలల్లో స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్బులను ప్రారంభించడం జరిగింది..

✤ తెలుగు పల్లె జ్ఞానం దోమలను చంపే హెర్బల్ మందును ఎన్.ఐ.ఎఫ్. శాస్త్రీయంగా నిర్ధారించడం.

✤ హైదరాబాద్‌లో జనవరి 2010 ఉద్యాన వనశాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ప్రదర్శనలో మన ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించగా ఎంతోమంది వాటిని మెచ్చుకోవడం జరిగింది.

✤ నెల్లూరులో ఆదిశంకర విద్యా సంస్థలో 'జరిగిన టెక్నాలజీ మేళా'లో 19 మంది ఇన్నోటర్లు పాల్గొనటం జరిగింది.

✤ 'టెప్' విజ్ఞాన సాంకేతిక విభాగం కేంద్ర ప్రభుత్వం ద్వారా 8 ఇన్నోవేటర్లకు ఆర్థిక సహాయానికి తోడ్పడటం.

✤ వెయ్యికి పైగా సాంప్రదాయ జ్ఞానాన్ని సేకరించి ఎన్.ఐ.ఎఫ్.కు పంపడం.

✤ దాదాపు తొమ్మిది మంది ఇన్నోవేటర్లకు తమ ఆలోచనలను కార్యరూపం చేయటానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని అందించటం.

✤ ఇన్నోవేటర్లకు జాతీయ వ్యవసాయ పరిశోధన, సాంకేతిక విజ్ఞాన మేనేజ్‌మెంట్ (నారమ్) లో వివిధ 'సెమినార్ల'లో శిక్షణా కార్యక్రమాల్లో అతిథిగా పాల్గొనేట్లు చేయటం.

✤ 'పల్లెసృజన' త్రైమాసిక పత్రికను విజయవంతంగా ప్రచురిస్తూ ఐదవ సంవత్సరంలోకి అడుగు పెట్టబోతోంది.

✤ 16 మంది 'బిట్స్ పిలాని' విద్యార్థులతో వరంగల్ జిల్లా ఏటూరు నాగారం, తొర్రూరు మండలాల్లోని పది గ్రామాల్లో 'జ్ఞానశోధ' చేయడం.

✤ చింతకింది మల్లేశం ఆసు మిషన్‌కు, నరసింహాచారి కాలిపోయిన ట్యూబ్‌లైట్లను వెలిగించే పరికరానికి ప్రొవిజనల్ పేటెంట్ పొందడం.

✤ ఇష్పాక్, లింగ బ్రహ్మంల పేటెంట్ కేసులను ఫైలు చేయడం.

✤ చింతకింది మల్లేశం పరిశోధనకుగాను రాష్ట్రపతి ద్వారా ప్రథమ జాతీయ పురస్కారం లభించింది.

✤ హైదరాబాద్‌లో జనవరిలో జరిగిన ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ లో పల్లెసృజన స్టాల్‌ను నిర్వహించగా అక్కడికి ఎంతోమంది సందర్శకులు స్టాల్‌కు విచ్చేయడం జరిగింది.

✤ జనవరి 26-30, 2010 న హైదరాబాద్ లో జరిగిన 'హార్టికల్చర్ షో' లో పాల్గొనడం జరిగింది.

✤ 1 మార్చి, 2010న హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) ఆవిర్భావ దినోత్సవంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఇన్నోవేటర్లు, అధికారులు, అనధికారుల సమ్మేళనం అందరికీ ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది.

✤ దేశ చరిత్రలోనే ప్రప్రథమంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో 14-20 మార్చి, 2010 జరిగిన 'ఎగ్జిబిషన్ ఆఫ్ ఇన్నోవేషన్స్' లో ఆంధ్ర ప్రదేశ్ నుంచి చింతకింది మల్లేశం, చంద్రశేఖర్ గార్లు పాల్గొన్నారు.

**మా కలలు :**

✤ ఏడవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.

✤ కనీసం నలుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి ఇప్పించడం.

✤ పల్లెజ్ఞానవేత్తల ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తేవడం

మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి. ప్రోత్సహించండి - పాల్గొనండి - ఆవిష్కరించండి.

**- బ్రిగేడియర్ పి. గణేశం,**
కో-ఆర్డినేటర్, హనీబీఏపి,
ఫోన్ : 98660 01678.

# పల్లెసృజన

సంపుటి-4 సంచిక - 3 జనవరి - మార్చి 2010



## సంపాదకవర్గం

సంపాదకులు :

**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సలహాదారులు :

**డా. కె.ఎల్. రావు**
**ప్రొ. అనిల్ గుప్త**
**డా. గీర్వాణి**
**శ్రీ పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**శ్రీమతి అరుణ గణేశం**
**పల్లె వీర రాఘవ రెడ్డి**

డి.టి.పి. & డిజైనింగ్ :

**నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.**

ఫోన్ : 040- 42215350

సెల్ : 93913 75655, 800 888 5655

E-mail : narendragrafix@gmail.com

ఎడిటోరియల్ అడ్రస్ :

పల్లెసృజన

102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,

సికింద్రాబాద్ - 500 094.

ఫోన్ : 040-27118555

E-mail : honeybeeap@gmail.com


## ఈ సంచికలో...


✤ ఎన్.ఐ.ఎఫ్. ఆవిర్భావ దినోత్సవం - 3

✤ ఆత్మీయ సమాగమం - హనీబీఏపి అంతర్మథనం - 5

✤ వాతావరణ మార్పులను తట్టుకోవటం : అట్టడుగు స్థాయిలో సర్దుకుపోయే తెలివి - 7

✤ ప్రకృతిలో జీవించు - సహజ జీవనం సాగించు - 9

✤ చిన్నవంగర గ్రామంలో జ్ఞానశోధ - 11

✤ వరంగల్ జిల్లా చిట్యాల గ్రామంలో జ్ఞానశోధ - 16

✤ చిన్నవిగా వుంటేనే స్థిరంగా మనగలుగుతాయా? - 19

✤ కణుపులతో చెఱకు నాటులో వృధాను అరికట్టే సాధనం - 20

✤ సహజ ఎరువులు - కషాయాలు - 22

✤ ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు - 24

✤ ఆర్గనైజేషన్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ సోషల్ డైమెన్షన్స్ ఆఫ్ హెల్త్ (ఓపియస్‌డిహెచ్) - 28

కవర్ లోపలి పేజీల్లో :

**హనీబీ ఏపి ప్రగతి**

**వ్యవసాయంలో పనికిరాని వ్యర్థాలనుంచి గ్యాస్ ఉత్పత్తి**

**మధ్య పేజిల్లో**

**ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో విజయవంతమైన ఎన్.ఐ.ఎఫ్. ఇన్నోవేషన్ల ప్రదర్శన**



## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
45, TPM Nagar,
Virattipathu - 625 010. Tamilnadu
E-mail : numvali@vsnl.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte (Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in



Printed & Published by : Brig. P. Ganesham, VSM (Poorva Senani), on behalf of "HoneyBeeAP"
102, Vayupuri, Sainikpuri Post, Secunderabad - 500 094. A.P.
Ph.: 040-27118555, Cell : 0 98660 01678. Printed at : Narendra Grafix, Chikkadpally, Hyderabad. Ph. : 93913 75655

# సంపాదకీయం

**28** ఫిబ్రవరి, **2000** నాడు పార్లమెంటు చట్టం ద్వారా 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' (యన్.ఐ.ఎఫ్.) ఆవిర్భవించింది. దేశంలోని పునాదిస్థాయి క్రియాశీలతకు, సాంప్రదాయ జ్ఞానానికి గుర్తింపునివ్వాలన్న ధ్యేయమే ఈ సంస్థ ఉద్దేశ్యం. గత పది సంవత్సరాల్లో ఎన్.ఐ.ఎఫ్. దేశం నలుమూలలా హనీబీ నెట్‌వర్క్ ద్వారా చేరే ప్రయత్నం చేసింది. కొంత సాధించింది. మరెంతో సాధించాల్సి వుంది.

ఒక లక్షా యాభై వేల జ్ఞాన సంపదను ఇప్పటివరకు సేకరించి, రాష్ట్ర జ్ఞాన రిజిష్టర్‌లో నమోదు చేసింది. ఆరుసార్లు దేశవ్యాప్తంగా ద్వైవార్షిక జ్ఞాన పోటీలను గ్రామీణ జ్ఞానానికి, క్రియాశీలతకై నిర్వహించింది. వందలకొద్దీ ఇన్నోవేటర్లు, స్కూట్లు రాష్ట్రపతి ద్వారా సత్కరింపబడ్డారు. పేటెంటుకై **24** దరఖాస్తులు దాఖలా చేయడమైంది. ఇంతవరకు ఏడు అమెరికాలో అంతర్జాతీయ పేటెంటుకై దరఖాస్తు చేయబడ్డాయి. ఇంతవరకు **34** పేటెంట్లు ఇవ్వబడ్డాయి. ఇందులో నాలుగు అమెరికాలో లభించినవి. మన రాష్ట్రం నుండి ఇంతవరకు పేటెంటు పొందినవారు విక్రమ్ రాథోడ్, నరసింహాచారి, మల్లేశం, సత్యనారాయణ. పేటెంట్లకై వేచియున్నవారు మహమ్మద్ ఇష్వాక్, లింగబ్రహ్మం.

జ్ఞాన సంగ్రహణకు సరియైన డాక్యుమెంటేషన్ ప్రథమ సోపానం. ఈ జ్ఞానాన్ని పరిశోధన శాలల్లో పరీక్ష చేసి, రెండవ దశలో దీనికై ఎన్.ఐ.ఎఫ్. దేశంలోని ప్రధాన ప్రతిష్ఠాత్మక పరిశోధన శాలలైన C.S.R.I., K.M.R., G.S.J., S.B.R.J. లతో సంధానం చేసింది.

ముంబాయి, న్యూఢిల్లీ, కాన్పూర్‌లలోని ఐ.ఐ.టి.లతో సాంకేతిక జ్ఞాన పరీక్షలకై ఒప్పందం కుదుర్చుకున్నది. అలాగే S.I.D., G.R.I.D.S. తో డిజైన్ పరంగా సంబంధం పెంచుకుంది. S.I.D.B.I. సంస్థతో ఆర్థికపరంగా అనుబంధాన్ని పెంచుకుంది. మరెన్నో విద్యా సంస్థలు, ప్రైవేటు పరిశోధన శాలలు, కన్సల్టెంట్లు అందరూ ఈ మహా ఉద్యమంలో సహకరిస్తున్నారు.

హనీబీ నెట్‌వర్క్ దేశవ్యాప్తంగా ఎన్.ఐ.ఎఫ్. మరియు ఇన్నోవేటర్ల మధ్య సంధానం చేస్తున్నది. మన రాష్ట్రంలో గత నాలుగు సంవత్సరాలుగా హనీబీఏపి ఈ నెట్‌వర్క్‌లో భాగంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. ఎన్.ఐ.ఎఫ్. ఆధ్వర్యంలో రెండు GYAN సంస్థలు ఉత్తర, పశ్చిమ భారతదేశంలో నెలకొల్పబడ్డాయి. ఆ ప్రాంతంలోని జ్ఞానాన్ని మార్కెట్లోకి తీసుకు రావటానికి ఈ సంస్థలు నిర్విరామంగా కృషి చేస్తున్నాయి.

శోధయాత్రలు సంవత్సరానికి రెండుసార్లు జరుగుతాయి. మరుగుపడిన జ్ఞాన దేవాలయాలైన గ్రామ పరిసరాల సందర్శన యాత్ర 'శోధయాత్ర'. ఈ పాదయాత్రలో స్వచ్ఛందంగా అనేక మంది ప్రముఖులు, విద్యార్థులు, రైతులు, స్త్రీలు, విద్యార్థులు దేశ విదేశాల నుండి వచ్చి పాల్గొంటున్నారు. **24** శోధయాత్రలు ఇంతవరకు దేశవ్యాప్తంగా నిర్వహింపబడ్డాయి. దాదాపు **200** కి.మీ. దూరం ఈ యాత్రికులు నడుస్తారు. అరకు లోయలో జూన్ **2008**లో జరిగిన శోధయాత్ర పాఠకులకు విదితమే.

**1** మార్చి, **2010**న ఆంధ్రప్రదేశ్‌లోని హనీబీఏపి వాలంటీర్లు, ఇన్నోవేటర్లు "ఎన్.ఐ.ఎఫ్. పండుగ" జరుపుకున్నారు. అతిథులను ఆహ్వానించి, వారితో రోజంతా మనసారా మాట్లాడుకున్నారు. ఎన్.ఐ.ఎఫ్. కార్యక్రమాలు ఇన్నోవేటర్ల అభిప్రాయాలు, భవిష్యత్తు ప్రణాళికలు అన్నీ నిష్కర్షగా, నిర్మొహమాటంగా అంతర్మథనం చేసుకున్నారు. ఈ సంచికలో "ఎన్.ఐ.ఎఫ్. ఆవిర్భావ దినోత్సవం" గురించి వివరాలు ప్రచురించాం.

మీ 'పల్లెసృజన' సమయానికి ప్రచురించుటకు మేము చేసిన కృషి కొంతవరకు ఫలించింది. ఇకముందు పాఠకులకు ప్రతి సంచికలో ఆ త్రైమాసికం పూర్తి అయ్యేలోగానే చేరేట్లు కృషి చెయ్యాలని సంపాదకవర్గం నిర్ణయించింది. మీ సహకారాన్ని సర్వదా కోరుతూ......

భవదీయ
**'బ్రిగేడియర్' గణేశం**

'పల్లెసృజన'లో కొన్ని వ్యాసాలను 'హనీబీ' ఇంగ్లీషు పత్రికనుండి అనువాదం చేయటం జరిగింది.
ఈ అనువాదాలను మాకు ఎంతో సహృదయంతో అందించిన శ్రీ సుబ్రహ్మణ్యం గారికి,
శ్రీ శశిమోహన్ గారికి కృతజ్ఞతలు – సంపాదకులు.






# ఎన్.ఐ.ఎఫ్. ఆవిర్భావ దినోత్సవం

– యం. బంగారు రాజు

మన భారతదేశం సాంప్రదాయ, సాంకేతిక విజ్ఞానానికి పుట్టినిల్లు. ప్రపంచ దేశాలచే కొనియాడబడే మన సాంప్రదాయ సాంకేతిక విజ్ఞానానికి మూలాలు పల్లెటూళ్ళలో వున్నాయి. అటువంటి విజ్ఞానాన్ని వెలికితీసి వాటిని భద్రపరుస్తూ, వాటి ఫలాలను గ్రామ స్థాయినుండి ప్రపంచ స్థాయి వరకు అందించాలనే మహాసంకల్పంతో పార్లమెంటు యాక్టు ద్వారా భారతదేశ ప్రభుత్వంచే ఏర్పాటు కావింపబడిన సంస్థ “నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.)”. ఈ సంస్థ ప్రధాన కార్యాలయం గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో వుంది. ఎన్.ఐ.ఎఫ్. ఛైర్‌పర్సన్, గవర్నింగ్ కౌన్సిల్‌గా డా. ఆర్.ఎ. మషేల్కర్ గత పదేళ్ళుగా నియమితులై వున్నారు. అలాగే గవర్నింగ్ కౌన్సిల్‌లో మనదేశంలోని మేథావులందరూ ఉన్నారు. వీరందరు ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంటారు. ఈ గవర్నింగ్ కౌన్సిల్‌కు ఎగ్జిక్యూటివ్ ఛైర్‌పర్సన్‌గా ప్రొఫెసర్ అనిల్ కె. గుప్తా గారు వ్యవహరిస్తున్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారు కూడా మెంబర్‌గా వున్నారు.

భారతదేశంలోని గ్రామాలన్నింటిని అనుసంధానిస్తూ శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరికీ ఉపయోగపడేలా సమర్థవంతంగా తీర్చిదిద్ది ఆ విజ్ఞానాలన్నిటిని పొందుపర్చి ప్రోత్సాహకాలను అందించడమే ఈ ఎన్.ఐ.ఎఫ్. ముఖ్య ఉద్దేశ్యం. దీనికొరకై శోధయాత్రలు, స్కౌటింగ్, డాక్యుమెంటేషన్, హనీబీ నెట్‌వర్క్, మ్యాగజైన్‌లు, ఇన్నోవేషన్ల కాంపిటీషన్లు, ఇన్నోవేటర్ల ఆలోచనలకు వాల్యుయేషన్ మరియు ఆర్థిక సహాయం, పేటెంట్ ఇప్పించడం, మొదలైన కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

ఎన్ఐఎఫ్ కార్యక్రమాలు ప్రారంభించిన ఈ పది సంవత్సరాలలో ఎన్నో విజయాలను సాధిస్తూ ముందుకు సాగుతోంది. పాఠశాలలో, కళాశాలల్లో, విశ్వ విద్యాలయాల్లో వర్క్‌షాప్‌లు నిర్వహించి, స్టూడెంట్స్ క్లబ్‌లను కూడా ఏర్పాటు చేయడం జరిగింది.



గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ ఆగ్యుమెంటేషన్ నెట్‌వర్క్ ("గ్యాన్") సంస్థ ఎన్ఐఎఫ్. కార్యకలాపాలకు అనుబంధ సంస్థగా పనిచేస్తున్నాయి. ఐడియాలను కార్యరూపంగా మలచి వాటి ఉత్పత్తి మరియు మార్కెటింగ్‌లకు "గ్యాన్" దోహదపడుతుంది. ఈ కార్యక్రమాల కొరకు దేశంలోని అతిపెద్ద సంస్థలు ఎన్ఐఎఫ్ కి ఉచితంగాను, ప్రభుత్వ నిధులతో కూడా తమ పూర్తి సహకారాన్ని అందిస్తున్నాయి.

ఎన్ఐఎఫ్ ఆవిర్భవించి దశాబ్ద కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆవిర్భావ దినోత్సవాన్ని మార్చి 1, 2010న హైదరాబాద్‌లోని రెడ్‌హిల్స్‌లో గల ఫ్యాప్సి భవనంలో ఈ వేడుకలను ముఖ్య అతిథులు, విద్యార్థులు, మరియు ఇన్నోవేటర్ల మధ్య జరిగింది.

ఈ కార్యక్రమానికి శ్రీ దుర్గాప్రసాద్ గారు స్వాగత వచనాలతో ప్రారంభించగా, పిచయ కార్యక్రమం అనంతరం బ్రిగేడియర్ గణేశం గారు ఎన్ఐఎఫ్ యొక్క ఆవిర్భావం, ఉద్దేశ్యాలు, కార్యకలాపాలను గురించి వివరించగా, శ్రీ చంద్రకాంత్ శర్మ గారు ఎన్ఐఎఫ్ ఇంకా సాధించవలసిన మైలు రాళ్ళను గురించి వివరించారు.

ఇన్నోవేటర్లందరూ తమతమ ఐడియాలను వివరిస్తూ వాటిని మార్కెటింగ్ చేయుటకు గల అవకాశాలను కూడా తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంతవరకు హనీబీఎపి విజయాలను గురించి విద్యార్థులు తెలుసుకుని, ఇంకా సాధించవలసిన విషయాలకు తగు సూచనలను కూడా అందించారు. ఎన్ఐఎఫ్‌ని స్ఫూర్తిగా తీసుకుని ఇంకా 70 దేశాలు ఈ కార్యక్రమాలను ప్రారంభించడం చాలా గొప్ప విషయంగా అభివర్ణించారు.

రైతు సదస్సులు, కిసాన్ మేళాలతో ఎన్ఐఎఫ్, హనీబీఎపి నిర్వహించిన స్టాల్ లకు మంచి స్పందన లభించింది. ఇన్నోవేటర్లు, ఎంటర్‌ప్రినర్లు, వలంటీర్లు ఎంతగానో ప్రశంసించారు.

ఇన్నోవేటర్ల సాధక బాధకాలు, కుటుంబ సమస్యలు, ఆర్థికపరమైన ఇబ్బందులు, సౌకర్యాల లేమి, సమాయం యొక్క విచిత్ర స్పందనల మధ్య వారికొచ్చిన ఐడియాల కొరకు నిరంతరం శ్రమించే వారి కొరకు ఆవిర్భవించిన ఎన్ఐఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఇన్నోవేటర్స్‌డే గా బ్రిగేడియర్ గణేశం గారు అభివర్ణించారు.

'పల్లెసృజన' ఆవిర్భావం గురించి, సర్క్యులేషన్ గురించి హనీబీ సంస్థ స్థాపించిన ఈ నాలుగు సంవత్సరాల కాలంలో సాధించిన విజయాలు, శోధయాత్రలు, ఇన్నోవేటర్లకు పేటెంట్లు, అవార్డుల గురించి వివరించారు. శోధయాత్రికులతో విద్యార్థులకు లభించిన స్పందనలు, సాంప్రదాయ విజ్ఞానాల గురించి ప్రశంసించారు.

ఒక వృద్ధుడు చనిపోతే ఒక గ్రంథాలయం మూత పడినట్లేనని గణేశం గారు నొక్కి వక్కాణించారు. కాబట్టి అటువంటి వారి నుండి వీలైనంత సమాచారాన్ని సేకరించి గ్రంథస్తం చేయాలని సూచించారు. అలాగే పిల్లలు, యువకులను ప్రేరేపించి నట్లయితే ఎన్నో విలువైన సమాచారాన్ని సేకరించడం, తద్వారా సరిక్రొత్త ఐడియాలు, ఆలోచనలకు పునాది ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ దిశగా కృషి చేయాలని ప్రతి ఒక్కరూ సమ్మతించారు.

శ్రీ చంద్రకాంత్ శర్మ గారు మాట్లాడుతూ ఇది ఒక ప్రత్యేకమైన ప్రపంచం అనీ, ఇందులో నీవు పాలుపంచుకోని కార్యక్రమాలే లేవన్నట్లుగా హనీబీ కార్యక్రమాలను అభివర్ణించారు. ఇన్వెన్షన్‌కు, ఇన్నోవేషన్లకు గల తేడా గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఇన్వెస్టర్లు ముందుకు రావాలన్నారు. శ్రీ దుర్గాప్రసాద్ గారు మాట్లాడుతూ వెయ్యికన్నా తక్కువ ఐడియాలను సకరించగలిగామని, మరియు వాటిని కార్యరూపం కావించి సమాజానికి ఉపయోగ పడే ఉత్పత్తులను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ద్వారా త్వరలో బంగారు భవిష్యత్తును కాంక్షించారు.

తమకు వచ్చిన ఆలోచనలకు ప్రాణం పోసే పరిస్థితుల లేమిలో కొట్టుమిట్టాడుతున్న తమకు ఎన్ఐఎఫ్ మరియు హనీబీఎపి కార్యక్రమాల ద్వారా తమకు ఎంతో ప్రాచుర్యం, సహకారాలు లభిస్తున్నాయని, ఇన్నోవేటర్లు ప్రసంశించారు.

పల్లెసృజన పత్రికను ప్రభుత్వం తరుపున ప్రతి మండల స్థాయికి 1,200 కాపీలను పంపించడం ముదావహం. అలాగే ఇన్నోవేటర్లు, వాలంటీర్లు, ప్రతి ఒక్కరు కనీసం పదిమంది చందాదారులను చేర్పించవలసిందిగా నిర్ణయం తీసుకున్నారు. ఎన్ఐఎఫ్, హనీబీఎపి కార్యకలాపాలను పాఠశాల స్థాయికి, గ్రామాల స్థాయికి ఇంకా త్వరిత గతిన సమర్థవంతంగా తీసుకు వెళ్ళడానికి ప్రతిఒక్కరు ప్రతిజ్ఞ పూనుకున్నారు. ●





# ఆత్మీయ సమాగమం - హనీబీఏపి అంతర్మథనం

**- చంద్రశేఖర్,** కారాకొల్లు

మార్చి 1వతేదీన ఎన్.ఐ.ఎఫ్. ఇన్నోవేటర్ల సమావేశం వుంది, మీరుకూడా వస్తే బావుంటుందని గౌరవనీయులైన గణేశం గారు చెప్పారు. కొత్తగా ఏమీ కనిపెట్టలేదు కదా ఎందుకు రావడం అని చెప్పాను. ఎగ్జిబిషన్ లాంటిదేది లేదు, ఈ సమావేశ, కేవలం ఇన్నోవేటర్ల ఉత్పత్తులు అమ్మాలంటే ఏ విధమైన మార్పులు చేయాలి? అవరోధాలను ఎలా అధిగమించాలి అనే విషయంమీద మీ అభిప్రాయాలు తెలపండి చాలు అన్నారు. సరేనని నేను, చిరంజీవి, బత్తినాయుడు, రవి నలుగురం కలిసి కారులో హైదరాబాద్ బయల్దేరాము. సమావేశ మందిరానికి చేరేసరికా బాగా ఆలస్యమైంది.

గణేశంగారు ఎన్.ఐ.ఎఫ్. గురించి, దాని పురోగతి, అవరోధాలను గురించి వివరించారు. ఆయన వివరించిన ఒక సన్నివేశం మాకు బాగా నచ్చింది. ఒక గ్రామంలో పిల్లలందరిని వారికి తోచిన మొక్కలను సేకరించి తెమ్మన్నారట, వారిలో ఒక అమ్మాయి తెచ్చిన మొక్కలు మిగతా వారికంటే భిన్నంగా వున్నాయట. ఇది ఎలా సాధ్యం? అని ఆ అమ్మాయిని అడిగితే, "నేను అందరికంటే ఒక కిలోమీటర్ ఎక్కువ దూరం వెళ్ళి మొక్కలు సేకరించి తెస్తున్నాను" అని చెప్పింది. నిజంగా ఆమె చెప్పిన జవాబు మాకు సందేశం అయింది. ఇకనుంచి ఎక్కువ మొక్కలపై ప్రయోగాలు చేయాలని నిర్ణయిం చుకున్నాము.

ఆ తరువాత నాకు మాట్లాడే అవకాశం వచ్చింది. మేము కనిపెట్టిన మొక్క ఆకుల రసంతో కోడి మాంసం ముక్కలను వుంచితే నెల రోజులు నిల్వ వుంటుంది అని చెప్పాను. అదే విధంగా 'ఆంధ్ర శాస్త్రవేత్తలు' అనే పుస్తకంలో మా పేర్లు ప్రకటించి వృక్ష శాస్త్రవేత్తలు అని మా పేర్లు ప్రకటించిన విషయం చెప్పగా అందరూ అభినందించారు.

ఈలోగా ఎన్ఐఎఫ్ జాతీయ అవార్డు గ్రహీత మల్లేశం గారు వచ్చారు. వీరిది నల్గొండ జిల్లా. ప్రధానంగా వస్త్రాలు నేస్తారు. ఒక చీర నేయాలంటే అందుకు సంబంధించిన 'ఆసు' పోయటానికి ఒక వ్యక్తి రెండువేల సార్లు



**సమావేశంలో ప్రసంగిస్తున్న వ్యాసరచయిత చంద్రశేఖర్**



**సమావేశంలో ప్రసంగిస్తున్న బత్తినాయుడు**

చేయిని అటూ, ఇటూ కదపాల్సి వుంటుంది. ఆ విధంగా వాళ్ళ అమ్మగారు పడుతున్న కష్టం మల్లేశం గారిని కదిలించింది. ఒక యంత్రాన్ని కనిపెట్టి ఆ వృత్తిదారులందరికీ కష్టాన్ని తగ్గించారు. ఆయన్ను కలిసి మీరు ఇంకా అనేక యంత్రాలు కనిపెట్టాలని కోరాను.

గౌరవనీయులు దుర్గాప్రసాద్ గారు మట్లాడారు. ఆయన మేము కనిపెట్టిన మందును, కృష్ణగారి స్ప్రేయర్‌ను మార్కెట్‌లో ప్రవేశ పెట్టడానికి తన స్వంత పనికంటే ఎక్కువగా కష్టపడ్డారు. కాని, పరిస్థితిలో మార్పులేదు. ఇలా విఫలమవడం ఆయనకు చాలా బాధ కలిగించిందని చెప్పారు. ప్రస్తుతానికి విఫలమయినా భవిష్యత్‌లో ఆయన విజయం సాధించి మాకు అండగా వుంటారన్న ధైర్యం వచ్చింది.

గౌరవనీయులు గణేశం గారి సతీమణి శ్రీమతి అరుణా గణేశం గారు హాజరయ్యారు. గణేశం గారికి ఫోన్ చేసినపుడు ఆమె మాట్లాడే సంస్కారవంతమైన విధానం జ్ఞాపకం వచ్చింది. ఒకవిధంగా ఇన్నోవేటర్లకు గణేశం గారికి ఆమె సంధానకర్తగా పనిచేస్తున్నారు.

ఇన్నోవేటర్లందరూ చురుగ్గా చాలా బాగా మాట్లాడారు. వారిలో ఇద్దరి గురించి చెప్పాలి. వారిలో ఒకరు రామ్మోహన్ రావుగారు. తెనాలినుంచి వచ్చారు. వారికి అనేక కొత్త విషయాలు తెలుసుకోవాలి, కనిపెట్టాలనే తపన. ఈ క్రమంలో ఆయన తన భార్యను కూడా పోగొట్టుకున్నారు. అదేవిధంగా సైన్సుకోసం పరిశోధనల కోసం ఇంటినుంచి పారిపోయి వచ్చిన వ్యక్తిని గణేశం గారు చూపారు. వారికి ఒక విజయంతో పరిస్థితులు చక్కబడాలని కోరుకున్నాను. బంగార్రాజు గారు మా అందరికీ 'మంచి పచ్చివాళ్ళు' అని పేరు పెట్టేశారు.

సమావేశానికి హాజరైన ఎం.బి.ఏ. విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. ఉత్పత్తులను మార్కెటింగ్ చేయుటకు చాలా ఉత్సాహాన్ని కనబర్చడంతో ఇన్నోవేటర్లలో తమ ఆలోచనలు త్వరలోనే వెలుగులోకి వస్తాయన్న ఆనందం వ్యక్తం కావడం గమనించాను.

సమావేశం ముగిసిన తర్వాత గణేశం గారి దగ్గర వీడ్కోలు తీసుకునేటప్పుడు ఆయన ఆణిముత్యం లాంటి మాట చెప్పారు. ఆయన మాటలలోనే చెప్పాలంటే "నేను ఉదయం నుంచి పనిచేస్తున్నాను కానీ, అలసి పోలేదు. నా స్వంతపనిలో అలసిపోతున్నాను" అన్నారు. 'ఇతరులకోసం బతికేవాడు జీవించివుంటాడు తనకోసం మాత్రమే బతికేవాడు బతికినా చచ్చినట్టే' అన్న వివేకానందుని మాటను జ్ఞాపకానికి తెచ్చింది. ఈసారి మేము విలువైన విషయాలు నేర్చుకుని సంతోషంగా తిరుగు ప్రయాణం అయ్యాము.




**సమావేశంలో ప్రసంగిస్తున్న చిరంజీవులు**

# వాతావరణ మార్పులను తట్టుకోవటం : అట్టడుగు స్థాయిలో సర్దుకుపోయే తెలివి

- ప్రొ. అనిల్ గుప్తా

ఒత్తిడిని తట్టుకొని బ్రతకటానికి 'సర్దుకు పోవటం' అన్నది ప్రతిరోజూ అవసరం అవుతుంది. ఏ రెండు క్షామాలు, వరదలు ఒకే రకంగా ఉండవు. అయినా మనం ఎంతో కాలం నుంచి కూడా ఉష్ణ ప్రదేశాలలో పర్యావరణంపై అధ్యయనాలు జరుపుతునే ఉన్నాం. ప్రాంతీయంగా ఉండే వ్యక్తులు, పెద్దలు తమ ప్రాంతాల్లో వుండే వాతావరణం పై అనుభవంతో తెలుసుకున్న జ్ఞానాన్ని మన పర్యావరణ శాస్త్రవేత్తలు ఎందుకు పట్టించుకోరు. ఈమధ్యనే బ్రహ్మపుత్రా నదికి వరదలు వచ్చినపుడు ఆ ప్రాంత ప్రజలు క్రిందినుంచి వరదనీరు పారే విధంగా ఎత్తయిన కర్రలపై గుడిసెలు నిర్మించుకున్నారు. ఇటువంటి వరద ప్రాంతాల్లో వీరి నిర్మాణ చాతుర్యానికి సరైన అంచనాలు కావలసి వుంటుంది. అంచనాలు సరిగ్గా వేయలేకపోతే ప్రజలు వలస వెళ్ళవలసి వస్తుంది. గుడిసె పై అంతస్తులో ఎండుగడ్డి నిలవ చేయటం ద్వారా వరద పోయిన తర్వాత పశువుల మేతకి తడుముకోవలసిన అవసరం పోయి ఆర్థికంగా పుంజుకోగలిగారు. కరువు ప్రాంతాల్లో వాతావరణంపై సరియైన అవగాహన ఉంటే కరువు వచ్చినపుడు ఆ ప్రాంతం నుంచి ఎప్పుడు వెళ్ళాలో ఎంతకాలం ఉండవచ్చునో సరిగ్గా అంచనా వేసుకోవచ్చు. అది మంచు ప్రదేశమైనా, వేడి ప్రదేశమైనా కావచ్చు. వాతావరణంపై అవగాహన ముఖ్యం. ప్రాంతీయ వాతావరణ భ్రమణాలను తెలిస్తే ఎప్పుడు మంచు కరిగిపోతుందో, ఎక్కడ పచ్చిగడ్డి మొలుస్తుందో, అది ఎన్ని పశువులకు సరిపోతుందో వేరే గడ్డి వున్న ప్రాంతానికి ఎన్ని పశువులు వెళ్ళవలసి వస్తుందో నిర్ధారించవచ్చు. అనిశ్చితంగా వున్న పరిస్థితుల్ని తట్టుకోవటానికి అన్నింటిని సమభావంతో చూసే నైజం కావాలి. అడవిలో వేటాడే వారికి ఏ దిశలో వెళ్తే వేట దొరుకుతుందో, ఎక్కడ నీళ్ళ కుంటలున్నాయో తెలిసి వుంటుంది. ఒకప్పుడు వడిసెలోని రాయి జంతువుకి నేరుగా తగిలినపుడు వేట బాగా దొరుకుతుంది. తగలనపుడు వేట దొరకదు. వనరులు ఒకేసారి ఎక్కువగా వాడకుండా నాలుగు కాలాల పాటు మన గలగాలంటే, లభించాలంటే సంస్థాపరమైన చర్యలు చేపట్టవలసి వుంటుంది. వాతావరణ మార్పులతో ఈ చర్యలు ఇంకా ప్రాముఖ్యతను సంత రించుకుంటాయి.

సనాతన ఇనుపియాక్ వేట గాళ్ళు అలాస్కా లోని మంచు ప్రదే శాల్లో నివసించే ఎస్కిమోలు ఆ ప్రాం తంలో నివసించే రింగ్డ్ సీల్స్ అనే సముద్ర జీవి ప్రవర్తన ద్వారా



వాతావరణాన్ని అంచనా వేస్తారు. సీల్ చేపలు సముద్ర మట్టానికి వచ్చి తమ ముచ్చికలు ఆకాశం వైపు చూపుతూ స్థిరంగా ఉంటే వాతావరణం స్థిరంగా ఉంటున్నట్లు, అవి అరుదుగా పైకి వచ్చి ముచ్చికలు స్థిరంగా సముద్రానికి సమతలంగా ఉంచినట్లయితే తుఫాను వస్తుందని గ్రహించేవారు. ఈ సీల్ భాష, తుఫాను భాషపై వారి బ్రతుకుతెరువు ఆధారపడి వుంది. బెలుగ జాతి వేల్ చేపలు (తాడిమీలు, పొగ్గరిమీను చేపలు) సాలమన్ చేపలు తక్కువగా వుంటే తీరంవైపుకి రావు. సాలమన్ చేపల సంఖ్య 'బీవర్' అనే జంతువులు తీరంపై కట్టే డ్యాములాంటి కట్టడాలపై ఆధారపడి వుంటుంది. డ్యాములు ఎక్కువగా వుంటే సాలమన్ చేపల సంఖ్య తక్కువగా వుంటుంది. అప్పుడు బెలుగ వేల్స్ చేపలు తక్కువగా కనిపిస్తాయి. వాతావరణ మార్పులు జీవరాసి సమతుల్యానికి సామాజిక ఏర్పాట్లకి సంబంధించినది కనక వాటిని విడిగా అధ్యయనం చేయలేము.

హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలి ప్రాంతంలో జొన్న పంటను ఎగువ ప్రాంతాల్లో పండించటం ప్రారంభించగానే ఆపిల్ సాగును కూడా ఎగువ ప్రాంతాలకి వేయటం సాగుతుంది. పూర్వం తరచూ వచ్చే వడగళ్ళ వానల కారణంగా ఆపిల్ సాగు ఎత్తయిన ప్రదేశాల్లో చేసేవారు కాదు. వడగళ్ళ వానలు తగ్గగానే ఆపిల్ సాగు కొండల్లోని పై ప్రాంతాల్లో కూడా చేయటం వలన భూసార పరిరక్షణ కొండ చర్యలు పడిపోవటం మొదలైన ఇబ్బందుల నుండి రక్షణ కల్పించబడేవి. ఒకసారి ఈ ప్రకృతి సిద్ధమైన వాతావరణ భ్రమణంలో అనిశ్చితి వస్తే ఈ సనాతన పద్ధతులని వాడే అవకాశం తగ్గిపోతుంది. ఈ సనాతన విజ్ఞానాన్ని సమీకరించటం, అర్థం చేసుకోవటం, ఇతరులకి చెప్పటం ఇదివరకున్నంత బాగా ఇప్పుడు లేదనే చెప్పాలి. అందుకే కొత్త సూచికలు కనిపెడుతునే వున్నారు. అన్ని వేళలా, అన్ని ప్రాంతాల్లో కాకపోయినా, ప్రకృతినుంచి తట్టుకునే వ్యూహాలు బలహీన పడుతున్నాయనే చెప్పాలి.

మొదటిసారి క్రీస్తుపూర్వం ఒకటవ శతాబ్దంలో, తరువాత 6వ శతాబ్దంలోను చైనా దేశంలో వ్యవసాయ సర్వస్వం 'ఫ్యాన్‌షెన్ చీన్' చే రూపొందించబడింది. దానిలో కరిగి పోయిన మంచుతో భూమిలో తేమను, పురుగుల నియంత్రణ ఎలా చేయవచ్చునో చెప్పబడింది. కరిగిన మంచుతో సీల్ చేపలకు చికిత్స చేసి వాటిని క్షామ పరిస్థితులను కూడా బాగా తట్టుకునేలా చేయవచ్చు. 'పాలివల్‌టైన్' పట్టుపురుగుల మలాన్ని కడిగిన మంచుతో కలిపినా ఇదే ఫలితాన్ని పొందవచ్చు. మురిగిపోయిన బియ్యం జావలో పట్టు పురుగుల మలాన్ని కలిపితే వచ్చే జిగటలాంటి పదార్థాన్ని గోధుమ పంటపై వాడితే అది చలికి, ఎండకి కూడా తట్టుకుని ఏపుగా పెరుగుతుంది. నీటి తాబేలు ఎంత ఎత్తున తన గూడు కట్టుకుంటుందో దాని ఆధారంగా అక్కడి వ్యవసాయదారులు వానాకాలం తీవ్రతని అంచనా వేసుకుంటారట. ఇదే విధంగా అనేక పక్షులు గూడు కట్టుకునే పద్ధతి ద్వారా వానల తాకిడిని అంచనా వేసుకోవచ్చు. చూస్తే పక్షులు మనుషులకన్నా ముందే ఈ ప్రకృతి పుస్తకాన్ని బాగా చదివినట్లు కన్పిస్తోంది. మరి దీర్ఘకాల వాతావరణ మార్పులు మనుషుల మాదిరిగానే అవి చెప్పగలవో లేదో తెలియదు. మనమూ అంత ఖచ్చితంగా చెప్పలేక పోతున్నాము. మనం దీనిపై సరియైన ధ్యాస పెడితే కాని చెప్పలేం. మలేరియా జ్వరం కొండపైన ఎగువ ప్రాంతాలకి పాకినట్లయితే ఇంతకుముందు దాని నిరోధక శక్తి లేని పిల్లలకి సైతం అది ఎక్కువగా సోకుతుంది అని అంటారు. ఇదివరకు ఈ ఇబ్బంది లేదు కనక దీనిని ఎలా ఎదుర్కోవాలో అప్పుడు ఆలోచించలేదు. ఇప్పుడు వాతావరణంలో మార్పులు, మలేరియా క్రిముల వ్యాప్తి చూసి మలేరియాని ఎదుర్కొనటానికి తగ్గ మొక్కల అన్వేషణ ప్రారంభం అయ్యే వుంటుంది. కొత్త సమస్యలకు కొత్త ఉపాయాలను వెతికే ఉద్యమానికి అక్కడి ప్రజలు ఏమి చేస్తున్నారో మనకి తెలియదు. మనం వారికే సహాయమూ చేయడం లేదు. ఇప్పటికే కనుగొన్న కొన్ని పద్ధతులు అక్కడా ఉపయోగ పడతాయేమో చెప్పలేం. పుప్పొడిని ఇక్కడినుంచి అక్కడకు, అక్కడినుంచి ఇక్కడకూ చేర్చేచ తేనెటీగల పద్ధతి ఇక్కడ పనికి వస్తుంది. పక్షులు, పాములు, జంతువులు, పురుగుల ప్రవర్తన మనకి ఎంతగానో ఉపయోగకారిగా వుంటుంది. ఇలాంటి విజ్ఞానాన్ని మనం ప్రపంచ వ్యాప్తంగా గమనించి, సేకరించి, కాచి, వడపోసి ఈ సామాజిక విజ్ఞానానికి ప్రాచుర్యం కల్పించాలి.

ఎనిమిది సంవత్సరాల క్రితం ఒక సంపాదకీయంలో పెద్ద స్థాయి పంటలలో సారం, బలవర్ధక శక్తికై మనం చేసే ప్రయత్నాలకన్నా చిన్న స్థాయి వ్యవసాయం, ఈ ఒత్తిడిని తట్టుకునే ప్రయత్నాలు అంతకన్నా ముఖ్యం అన్నాం. ఇప్పుడు వాతావరణ మార్పులను తట్టుకోవటానికి సృజనాత్మకంగా కలిసికట్టుగా పనిచేయాల్సి వస్తుందని తేటతెల్లమైంది. కాని, మనం గత దశాబ్ద కాలంగా స్థానికంగా వుండే విజ్ఞానాన్ని పెంపొందించటానికి ఏమీ చేయలేదు. మన వైజ్ఞానికులకన్నా ప్రకృతిలో మార్పులను ఎంతో నిశితంగా గమనించిన ఎంతోమంది వయోవృద్ధులు, ప్రత్యేకించి శతాధిక వృద్ధులు ఉండేవుంటారు. వారు మనల్ని వదిలి, మననుంచి వెళ్ళిపోయే ముందు వారినుండి ఆ జ్ఞానం మనం తెలుసుకోవాలి కదా! జాతీయ స్థాయిలో ఈ విజ్ఞానాన్ని గ్రంథస్థం చేయటం ఒక మంచి ఆలోచన అని విజ్ఞత చెపుతోంది. వారి జ్ఞానాన్ని క్రమ పద్ధతిలో సేకరించి, విశ్లేషించి వచ్చిన సారం ద్వారా వాతావరణం లోని మార్పులను ఎదుర్కొనటానికి వ్యూహాలు రచించుకోవాలి. పెద్దల పాదాల దగ్గర కూర్చొనటానికి మన నాయకులు ఇష్ట పడతారో లేదో చూడాలి మరి. ●

**('హనీబీ' ఆంగ్లపత్రిక సౌజన్యంతో)**



# ప్రకృతిలో జీవించు - సహజ జీవనం సాగించు

## అవనిగడ్డ నివాసి - నడకుడిటి కృష్ణ

నేను చేస్తున్న ప్రయోగాలన్నీ కూడా మానవ ఆరోగ్యం, వాతావరణ కాలుష్యం మొదలైన వాటికి సంబంధించినవే. పాశ్చాత్య దేశాల్లో పారిశ్రామిక విప్లవం వచ్చిన దగ్గరినుండి మనిషి ప్రగతి, అభివృద్ధి పేరుతో ప్రకృతి వినాశనానికి, వాతావరణ కాలుష్యానికి కారణమౌతున్నాడు. శిలా ఇంధనాలు విచ్చలవిడిగా వాడటం ద్వారా పర్యావరణ సమతూకం దెబ్బతినటానికి, తద్వారా అనేక వృక్ష, జీవజాతులు నశించిపోవటానికి కారణమౌతున్నాడు. మనుషుల్లో ఉన్న దురాశ, అహంకారం కారణంగా ప్రస్తుతం మనిషి మనుగడే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి వచ్చింది. ఇది ఇలాగే కొనసాగ వలసిందేనా? దీనికి ప్రత్యామ్నాయం లేదా? ప్రకృతిని నాశనం చేయకుండా మనిషి సుఖంగా జీవించలేడా? ప్రస్తుతం ప్రగతి పేరుతో జరుగుతున్నదంతా మానవాభ్యుదయం కోసమేనా? లేక మానవ వినాశనానికి కారణభూతమౌతుందా?

ఇలాంటి అనేక ప్రశ్నలకు సమాధానాలు వెతికే ప్రయత్నంలో నావరకు నేను ఏదైనా ప్రత్యామ్నాయ మార్గం కనుక్కోగలనా అనే ప్రయత్నంలోనే అనేక అంశాలను పరిశీలించి, అనేక ప్రయోగాలు చేసి నేను కొన్ని విషయాలు తెలుసుకోవటం జరిగింది. వాటి గురించి క్లుప్తంగా వివరించే ప్రయత్నం చేస్తాను.

నా పరిశీలనలో తేలిన విషయమేమిటి అంటే ప్రతిదానికి ప్రత్యామ్నాయం ఉంది. ఇంధనానికి, మందులకు, విద్యుత్ ఉత్పత్తికి, పర్యావరణానికి హానిచేయని, మానవ ఆరోగ్యాన్ని పాడుచేయని ప్రకృతిసిద్ధమైన అనేక ప్రత్యామ్నాయాలు ఉన్నవి. కానీ, మనం వాటిని ఉపయోగించే ప్రయత్నం చేయటం లేదు. ప్రకృతి సహజంగా జీవించటం కాకుండా, ప్రకృతిని జయించాలనే అహంకారంతో వినాశనాన్ని కొని తెచ్చు కుంటున్నాము. ఈ పరిస్థితిని మార్చకపోతే కొన్నాళ్ళకు మానవజాతి మనుగడే ప్రశ్నార్థకం కావచ్చు. అన్ని ప్రత్యామ్నాయాల గురించి తెలియ జేయటం ఈ ఉత్తరం ద్వారా సాధ్యం కాదు. కాబట్టి మందుల గురించి క్లుప్తంగా తెలియ జేస్తాను.

బ్రిటీషువారు మనదేశంలోకి ప్రవేశించక ముందు మన దేశంలో ఆయుర్వేదము, యోగా, ప్రకృతివైద్యము లాంటి అనేక వైద్య విధానాలు ప్రచారంలో ఉండేవి. బ్రిటీషువారు మన దేశాన్ని ఆక్రమించుకొని వాళ్ళ పరిపాలనతో పాటు 'అల్లోపతి' వైద్య విధానాన్ని కూడా మనకు బలవంతంగా అంటగట్టారు. మనం 'తెల్లవాళ్ళు తెలివిగలవాళ్ళు' అనే బానిస భావాలను బాగా వంటబట్టించుకొని, మన ఆయుర్వేదాన్ని అటకెక్కించి 'అల్లోపతి' వైద్యాన్ని నెత్తిన పెట్టుకొని పూజించటం మొదలెట్టాము. ఏ చిన్న జబ్బునైనా పెద్ద జబ్బునైనా ఇంజక్షన్ చేయించుకోవాలనో, బిళ్లలు వేసుకుంటేనో గాని వ్యాధి తగ్గదు అనే భ్రమలో పడిపోయాము. మిగిలిన ఆరోగ్య సూత్రాలను, ఆహార విహార నియమాలను పూర్తిగా అలక్ష్యం చేయటం ప్రారంభించాము. ఆయుర్వేద మందులు అంటే అనాగరికులు వాడేవి, అల్లోపతి మందులు వాడితే నాగరికులు అనే భ్రమల్లో జీవించటం ప్రారంభమైంది.

అల్లోపతి వైద్యవిధానంలో మందులు ప్రకృతిసిద్ధమైన మూలికలనుంచి కాకుండా ప్రమాదకరమైన రసాయన సమ్మేళనాలతో తయారు చేయటం జరిగుతుంది. ఈ మందుల తయారీ ప్రక్రియలో అనేక విష రసాయనాలు వ్యర్థాలు బయటికి వదిలి పెట్టడం జరుగుతుంది. వాటి కారణంగా నీరు, గాలి, భూమి కలుషితమై పోవటం జరుగుతుంది. మన హైదరాబాద్‌లోని జీడిమెట్ల పారిశ్రామిక వాడలో మందుల కంపెనీల కారణంగా చుట్టుప్రక్కల ప్రాంతాల్లోని గాలి, నీరు, నేల మొత్తం కలుషితమై పోవటం మనకు తెలిసిందే. అలాగే ఆ కంపెనీల్లో పనిచేసే కార్మికులు, చుట్టుప్రక్కల నివసించే వారు రసాయనాల కారణంగా అనేక వ్యాధులతో బాధపడటం మనము చూస్తూనే ఉన్నాము. ఇన్ని కష్ట నష్టాలను భరించి తయారు చేసిన మందుల వలన మానవాళికి ఎంతవరకు ప్రయోజనం కలుగుతుంది అంటే





సరియైన సమాధానం రాదు. అల్లోపతి మందుల వాడకం పెరిగి తర్వాతే మధుమేహం (షుగర్), రక్తపోటు (బి.పి.) లాంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి సంఖ్య పెరిగింది.

'పెన్సిలిన్' మందును కనుక్కోగానే ఇంకేముంది ప్రపంచంలో వ్యాధులు అనేవి లేకుండా చేసేస్తాము అని చంకలు గుద్దుకున్నారు. కానీ, తర్వాత తెలిసొచ్చింది అందరూ అనుకున్నట్టుగా 'పెన్సిలిన్' అనేది 'సర్వరోగ నివారిణి' ఏమీ కాదు. దానికీ కొన్ని పరిమితులున్నాయి అని. యాంటీ బయాటిక్ అనేది ఒక జీర్ణక్రియ బ్యాక్టీరియా ద్వారానే జరుగుతుంది. ఏదైనా వ్యాధి వచ్చిందని మనం యాంటీ బయాటిక్ వాడితే అది మన ప్రేవుల్లో వున్న మంచి బ్యాక్టీరియానూ కూడా చంపేస్తుంది. దాంతో మన జీర్ణక్రియ మొత్తం అస్తవ్యస్తమై పోతుంది. దాంతో అనేక రకాలైన పోషకలాపాలు ఏర్పడి నిదానంగా అన్ని అవయవాల పనితీరును దెబ్బతిని జీవితంతం రోగిగానే రోజూ మందులు మింగుతూ జీవితాన్ని గడపాల్సి వుంటుంది. యాంటీ బయాటిక్ అనేది రోగికి ప్రాణాపాయ స్థితిలో ఇవ్వాల్సిన మందు. ప్రతి చిన్న వ్యాధికి వాడినట్లయితే మనము రోగాలను కొనుక్కు తెచ్చుకున్నట్లే.

ప్రస్తుతం ఎక్కువ వాడుతున్న మందుల్లో 'యాంటాసిడ్' ఒకటి. ఇది ఒక ప్రమాదకరమైన మందు. మన జీర్ణాశయంలో జీర్ణక్రియలో భాగంగా మనం తీసుకున్న ఆహారాన్ని బట్టి ఆమ్లాలు ఉత్పత్తి అవటం జరుగుతుంది. ఈ ఆమ్లాలు హానికరమైన సూక్ష్మజీవులను సంహరించటం ద్వారా మనకు వ్యాధులు రాకుండా కాపాడుతాయి. మన శక్తికి మించిన ఆహారం తీసుకున్నప్పుడు గానీ, ఆకలిగా లేనప్పుడుగాని ఆహారం తీసుకున్నచో జీర్ణాశయంలోని ఆమ్లాలు జీర్ణ వాహినిలోకి రావటం జరుగుతుంది. దీన్ని 'ఎసిడిటీ' (అజీర్ణము) అంటారు. దానికి కారణమేమిటో తెలుసుకొని జాగ్రత్త పడితే సరిపోతుంది. ఇది అసలు వ్యాధే కాదు. కానీ దీన్ని పెద్ద వ్యాధిగా చిత్రీకరించి యాంటాసిడ్ వాడకం విపరీతంగా పెంచేశారు. దీనివల్ల జీర్ణక్రియ పూర్తిగా దెబ్బతినటం జరుగుతుంది. ఇలాగే అనేక రకాలైన మందులు అవసరం ఉన్నా, లేకున్నా వాడి మనము వ్యాధులను కొని తెచ్చుకుంటున్నాము.

ప్రకృతి సృష్టిలోని ప్రతిజీవికి జీవించటానికి కొన్ని నియమాలు ఏర్పాటు చేసింది. ఆ నియమాలు ఉల్లంఘించనంత కాలం ఏ జీవియైనా ఆరోగ్యంతోనే వుంటుంది. ఒక్కో జీవి శరీర ఉష్ణోగ్రత ఒక్కో రకంగా వుంటుంది. ఆ ఉష్ణోగ్రత హెచ్చు తగ్గుల వలన జీవులకు వ్యాధులు రావటం జరుగుతుంది. జంతువులు, మనుష్యుల్లో జీర్ణక్రియ అంతా సూక్ష్మజీవుల ద్వారా జరుగుతుంది. ఒక్కోరకమైన సూక్ష్మజీవి ఒక్కో ఉష్ణోగ్రత వద్ద మనగులుగుతుంది. ఆ ఉష్ణోగ్రతలో తేడా వచ్చినప్పుడు సూక్ష్మజీవులు మనుగడ సాగించటం కష్టమౌతుంది. అప్పుడు వేరే సూక్ష్మజీవులు ప్రవేశించి ఆ జీవులకు హానిచేయటం వలన వ్యాధి రావటం జరుగుతుంది. సృష్టిలో మిగిలిన జీవులు ప్రకృతి ఏర్పాటు చేసిన నియమాలకు లోబడి జీవించటం వలన వ్యాధులు రాకుండా జీవించగలుగుతున్నాము. కానీ, మానవులు మాత్రం మేము తెలివిగలవాళ్ళం అనే అహంకారంతో ప్రకృతి నియమాలను ఉల్లంఘించి అనేక రకాలైన వ్యాధులతో బాధపడుతున్నారు.

సృష్టిలో అన్ని జీవులు ఒకదానిమీద ఒకటి ఆధారపడి జీవిస్తాయి. సూక్ష్మజీవి దగ్గరనుంచి అతి పెద్ద జీవుల వరకు అన్నీ ఒకదానిమీద ఒకటి ఆధారపడి జీవిస్తున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే సూక్ష్మజీవులే అన్ని జీవుల్లోను ఉండి అవి తీసుకొన్న ఆహారాన్ని జీర్ణం చేసి వాటి మనగుడకు కారణమౌ తున్నాయి. మట్టిలో ఉండే సూక్ష్మజీవులు మొక్కలకు కావలసిన పోషకాలను అందించి, వాటి పెరుగుదలకు దోహదమవుతున్నాయి. మనిషి మిగతా జీవులను చంపేసి తన మనుగడకే ప్రమాదం కొని తెచ్చుకుంటు న్నాడు. కాబట్టి సృష్టిలోని ప్రతి జీవి ప్రకృతికి అనుగుణంగా జీవించినంత వరకే దాని మనుగడ సాధ్యమౌతుంది. ప్రకృతిని జయించాలి అనుకుంటే దాని మనుగడే లేకుండా పోతుంది. కాబట్టి మనమందరం ప్రకృతిలో లభించే సహజ ఉత్పత్తుల ద్వారా మన అవసరాలను తీర్చుకుంటూ, ప్రకృతి సిద్ధమైన మందులు వాడుతూ జీవించి నట్లయితే సుఖంగా కొన్ని కాలాల పాటు భూమ్మీద జీవించగలుగుతాము.

ఇవన్నీ తెలుసుకున్న తర్వాత నేను గత 15 సంవత్సరాల నుండి ప్రకృతిసిద్ధంగా లభించే ఉత్పత్తులమీద ప్రయోగాలు చేయటం ప్రారంభించాను. అల్లోపతి మందులు వాడటం మానేసి, అన్ని వ్యాధులకు ప్రకృతిలో లభించే ఔషధాలు మాత్రమే వాడుతూ వాటి పనితీరు పరిశీలించటం ప్రారంభించాను. నా పరిశీలనలో తేలిన విషయమేమిటంటే మన చుట్టూ లభించే ఔషధ మొక్కలతో అన్ని వ్యాధులు నయం చేసుకోవచ్చు. అనేక వ్యాధులపై ప్రయోగాలు చేస్తున్నాను.

కృష్ణ గారి భావాలు ఎంతో విలువైనవి,సహజమైనవి కూడా. ప్రకృతిలో భాగంగా, ప్రకృతిని గౌరవిస్తూ సహజ జీవనం గడపటం ఉత్తమమైన జీవన విధానం. కృష్ణ గారి ప్రయోగాలు విజయవంతమై సర్వ ప్రజానీకానికి చేరాలని మనసారా ఆశిస్తున్నాం. **– ఎడిటర్**

# చిన్నవంగర గ్రామంలో జ్ఞానశోధ



హనీబీఏపి "జ్ఞానశోధ" ప్రయోగంలో మా అనుభవాలను ఈ క్రింది నివేదికలో తెలియజేస్తున్నాము. **14 మందితో కూడిన మా బృందాన్ని 5 విభాగాలుగా విభజించి, వరంగల్ జిల్లాలోని తొర్రూరు, మొలుగు మండలాల్లో పర్యటించాలని నిర్ణయించారు. ప్రతి బృందానికి ఒక గ్రామం లేదా తండా కేటాయించడం జరిగింది. ఆ బృందం ఆ గ్రామంలో మూడు రోజులుండి ఆ గ్రామానికి సంబంధించిన అన్ని వివరాలను సేకరించవలసి వుంటుంది. మా బృందానికి తొర్రూరు మండలం చిన్న వంగల గ్రామాన్ని కేటాయించారు. ఈ గ్రామంలో 'బిట్స్ ఫిలాని' విద్యార్థులు సుభాష్ ఆచంట (కో-ఆర్డినేటర్), తరుణ్ రెడ్డి బేతి, రాకేష్ తోనుకున్నూరి లు. పర్యటించి తమ అభిప్రాయాలను వెలిబుచ్చిన నివేదిక**

**జ్ఞానశోధలో పాల్గొన్న స్వోట్ల బృందం :**

సుభాష్ ఆచంట (కో-ఆర్డినేటర్), తరుణ్ రెడ్డి బేతి, రాకేష్ తోనుకున్నూరి లు.

**సందర్శించిన గ్రామం :** చిన్న వంగర, తొర్రూరు మండలం, వరంగల్ జిల్లా.

**సందర్శన ధ్యేయం :**

గ్రామాలను సందర్శించడం, గ్రామీణ వాతావరణంతో మమేకం కావడం, సందర్శించిన గ్రామస్తుల ఊహాజనిత శక్తి, సాంప్రదాయ జ్ఞానం, సాధించిన సమస్యలు, సాధించలేని వాటికి సూచించే మార్గాలు, పరిష్కారాలతో కూడిన సమాచార్ని సేకరించి కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసి డాటాబేస్ తయారు చేయించడం.

**దీనిమూలంగా లబ్ది పొందేవారు :**

గ్రామాలు, గ్రామీణప్రాంతాల వారు. దేశం.

**ప్రాజెక్టు సమయం :** 11 జూన్, 2009 నుండి 14 జూన్, 2009 వరకు

**ప్రాజెక్టు వివరాలు :**

బృంద సందర్శనకు వెళ్ళిన 3 రోజులలో మొత్తం గ్రామాన్ని నాలుగు తాండాలను సందర్శించారు. అవి 1. కిష్టతాండ, 2. బంగారు బిళ్ళతాండ, 3. ఒంపుతాండ, 4. ఎల్.బి. తాండ.

ఇక 'చిన్నవంగర' గ్రామం పేరు విషయానికి వస్తే పెద్ద గ్రామమైన పెద్ద వంగర తరువాతి గ్రామం కావున దీనికి చినవంగర అన్న పేరు వచ్చింది. అలాగే 'వంగర' అనే పదం తెలుగులో 'వంకర' అనే పదంనుండి పుట్టింది. ఈ గ్రామాన్ని బేరాతి అంటారు. వరంగల్ నుండి తొర్రూరు వెళ్ళే మార్గంలో ఆగ్నేయంగా 60 కి.మీ. దూరం ప్రయాణం చేసి లోపలికి సుమారు 10 కి.మీ. దూరం వెళ్ళాలి. మొత్తం గ్రామం ప్రధానంగా వ్యవసాయం మీదనే ఆధారపడి ఉంటుంది. కొంతమంది ఇతర వృత్తులు, వ్యాపకాలపై ఆధారపడినవారూ ఉన్నారు. ఈ గ్రామం వెలుపల ఒక చిన్న సరస్సు, మహాశివుని ఆలయం ఉన్నాయి. ఈ శివాలం 1083 – 1323 మధ్య పాలించిన కాకతీయులు నిర్మించినది.

ఈ గ్రామంలో అతి పెద్దవ్యక్తి, మూలికావైద్యులు 88 సంవత్సరాల చాకలి రాములు. ఈ గ్రామంలో మరో ప్రఖ్యాత మూలికా వైద్యులు కీ.శే. చెన్నసాములు ఉండేవారు. అతను చనిపోయి చాలా కాలం అయినప్పటికీ ఆ చుట్టు ప్రక్కల గ్రామాలలో అతని పేరు ఇప్పటికీ ప్రఖ్యాతంగా వినబడుతూ వుంటుంది. పక్షవాతానికి సరియైన వైద్యం లేని రోజుల్లో పక్షవాత నివారణకు మార్గం కొనుగొన్నందుకు



అతనిపేరు ఇప్పటికీ ప్రసిద్ధంగా వినబడు తోంది. అక్కడి గ్రామస్తులను, అలాగే గ్రామంలోని పెద్దలను కలిసి వివిధ విషయాలు తెలుసుకున్నారు. వారు వేసవిలో చల్లదనానికి, మిగిలిన కాలాలలో బలానికి, దీర్ఘకాల జీవనానికి రాగి జావ వాడుతారు. ఇంకా ఆ గ్రామస్తులు అందించిన అనేక సత్యాలు, అనుభవాలు, అపార జ్ఞాన సంపద ఈ క్రింది విధంగా ఉన్నాయి.

**ఉంట గల్జేరు :** జలుబు, దగ్గుకు.

**పిండికూర :**

మూత్రాన్ని శుద్ధి చేస్తుంది. చెన్నంగాకు, ముర్కుపువ్వు మరియు బేడ సవరం ఎండు ఆకులు పొడిచేయాలి. ఈ పొడిని సమపాళ్ళలో మిరప్పొడి, సాంప్రదాయ బారతీయ మూలికలు, చింతపండుతో కలిసి భోజనానికి ముందు కొద్ది మోతాదులో తీసుకోవాలి.

కొంతకాలంక్రితం వరకు బాసుమతి బియ్యం వాడుకలో వుండేవి. కాలక్రమేణా అవి కనుమరుగు అయ్యాయి. అవి... తైదలు, కాకిరెక్కలు మరియు చిట్టి ముత్యాలు. వాటి రుచి, పరిమళం అనన్యమైనది.

శ్రీ చాకలి రాములు అనేక మూలికా వైద్య విధానాలను అందించాడు. అవి ఈ క్రింది విధంగా ఉన్నాయి.

**గుండెనొప్పికి :**

నల్లమోడిచెక్క, మాదవారి వేర్లు బెల్లంతో కలిపి తీసుకోవాలి.

**కీళ్ళ నొప్పులకు :**

కొమ్మలతో సహా వేప ఆకులను నీళ్ళలో ఉడికించి, నొప్పులు ఉన్నచోట కట్టాలి.

**మెడనొప్పి, వీపు నొప్పికి :**

మద్దిచెక్క, ఖర్జూరం కలిపి తీసుకోవాలి.

**వీపు నొప్పికి :**

తుమ్మచెక్క, మిరియాలు, ఎండిన అల్లం, పిప్పళ్ళు, మోడి, కరక్కాయలు మరియు మంచి మధురం.

**లావు (ఊబకాయం) తగ్గటానికి :**

తాటి బెల్లంతో కలిపిన వాము తినాలి.

**సహజమైన కాటుకకు :**

ఎల్లిపాయ, పసుపు, కొబ్బరినూనె కలిపి కంటిక్రింది భాగంలో పూయాలి.

**శక్తి కొరకు :**

నల్ల తాటిగడ్డలు, పాలు.

**దగ్గుకు :**

పసుపు, పాలు.

**పాదాలలో పగుళ్ళకు :**

బెల్లం పాకంతో జీడిగింజలు, నల్ల నువ్వులు.

**వివరంగా తండాలు :**

**కిష్టతాండ :**

ఈ తాండ సుమారు 100 సంవత్సవరాల నాటిది. ఈ తాండ పుట్టినప్పటి నుండి కిష్ట కుటుంబ సభ్యులు దాని బాగోగులు చూస్తున్నారు. ఈ స్థావరాన్ని కనుగొని, తండ ఏర్పాటు చేసిన వ్యక్తిపేరు మీదుగా ఈ తాండ వెలిసింది. ఈ తాండలో చాలా పెద్దవారు బురా, జాటోచ్, సత్, లచ్చు, సూరి మరియు రాము. గత 15 సంవత్సరాలు గా ఈ గ్రామంలో దాదాపు అన్ని సాంప్రదాయాలు కనుమరుగయ్యాయి.

**బంగారు చిల్లతాండ :**

ఈ తాండ సుమారు 80 సంవత్సరాలకన్నా తక్కువ నాటిది. ఈ తండా పేరు వెనుక ఒక గాథ వుంది. కొందరు వలస వాసులు బంజార వాగుమీదుగా నడచి వెళ్తూ ఉండగా ఒక దేవుని బంగారు విగ్రహం కనిపించింది. అక్కడ ఒక చెలమ (త్రాగునీటి గుంట) కన్పించింది. అందుకే దీనిని "బంగారు చిల్లతాండ" అని వ్యవహరిస్తారు. ఈ గ్రామ పెద్ద శ్రీ డి. బక్షి. క్రిమిసంహారిణి, మూలికా ఔషధాలకు సంబంధించిన కొన్ని చిట్కాలు తెలియజేశారు. అవి.....

పాలలో క్రిమీ కీటకాలను నాశనం

**'పల్లెసృజన'లో తెలియజేసిన సాంప్రదాయ జ్ఞానాలు, చిట్కాలు, ఆయుర్వేద మూలికల వివరాలు ఆయా వ్యక్తులు తెలియజేసినవి యదాతథంగా తెలియజేస్తున్నాము. వీటిపై హనీబీఏపి గాని, పల్లెసృజన కాని ఏలాంటి ప్రయోగాలు చేయలేదు. పాఠకులు వాటిపై నమ్మకముంటే వాటిని వాడి ఉపశమనం పొందగలరు.**

చేసే క్రిమి సంహారిణి మందులు వేప పళ్ళను గింజలతో సహా ఒక కుండ నీళ్ళలో 4-5 రోజులు నానబెట్టి తరువాత మెత్తగా పిసికి వడగట్టిన నీటిని పంటపై పొలాల్లో చల్లినచో కనీసం ఒక సంవత్సరం పాటు ఎలాంటి తెగుళ్ళు సోకవు.

**పాము కాటుకు :**

తెల్ల ఉసిరిని కాసిన్న నీళ్ళతో ఒక రాయిమీద చాది ఆ గంధాన్ని కళ్ళక్రింద పూయాలి. ఎలాంటి సమస్య లేదని నిర్ధారించుకున్న తరువాత నేరుగా కడుపులోకి తీసుకోవచ్చు. ఈ చెట్టు చుట్టూ 10 మీటర్ల దూరం ఎలాంటి పాములు రావు అని పేర్కొన్నారు.

బక్షి సోదరుడు భజ్జా ఈ క్రింది వివరాలు అందించాడు.

తెల్లబట్ట వ్యాధి నివారణకు తెల్ల మెధువు చుక్కలు క్రమం తప్పకుండా మూడు రోజులు తీసుకోవాలి.

వాపులకు దీకముల్లు ఉపయోగించాలి.

మనుషులలో గాని, జంతువులలో గాని శక్తి పుంజుకోవటానికి పెద్దమాని చెక్కు వాడాలి.

జంతువులలో మత్తు, వెర్రిగా ప్రవర్తించడం లాంటి వాటికి ఎల్కనాగోరు పనిచేస్తుంది.

మనుషులలో గాని, జంతువులలో గాని మలబద్ధకం, దగ్గు తగ్గటానికి నల్ల ఉసురు బాగా పనిచేస్తుంది.

వాతం తగ్గడానికి గాడిదగడ్డపాకు పనిచేస్తుంది.

**ఒంపుతాండ :**

ఒంపు తాండ సుమారు 10 సంవత్సరాల క్రితం బంగారు చిల్ల తాండానుంచి విడివడిని కొత్త తాండ. ఇది బంగారు చిల్లతాండ వంపు మీదుగా కొత్తగా ఏర్పడ్డది. ఇది చాలా చిన్న తండా. కేవలం వ్యవసాయం, వరి పండించడం మీదనే ఆధారపడ్డది.

**ఎల్.బి. తాండ :**

లొట్లబండ (రాయి) పేరుమీదుగా దీనికి ఎల్.బి. తాండ అన్న పేరు వచ్చింది. తమకు అనుకూలంగా ఉండేందుకు ప్రభుత్వం దీనిపేరు ఎల్.బి. తాండగా మార్చింది. ఇది సుమారు 100 సంవత్సరాల నాటి తండా. ఈ తండాలో చాలా వృద్ధుడైన పప్పులు కొంత సమాచారం అందించడం





జరిగింది.

❀ సెగుండ ఆకులు, గంజి మిశ్రమాన్ని సెగుండగా పిలుస్తారు. ఆవులు ఆరోగ్యంగా ఉండడానికి దీనిని ఇస్తారు.

❀ వడదెబ్బకు తంగేడు వేర్లు బాగా పనిచేస్తాయి.

❀ వక్షవాతానికి వాలిచెట్లు వేర్లు ఉపయోగిస్తారు.

❀ నదులలో లభించే ముళ్ళచెట్టు పూలు పాలు లేదా గంజి లేదా మజ్జిగతో కలిపి వాడితే దురదలు తగ్గుతాయి.

❀ పక్షవాతానికి రాముండ చెట్టు పూలు లేదా వేర్లు మరియు తంగేడు కలిపి వాడాలి.

❀ చక్కని ఆరోగ్యానికి బిల్లాల చెట్టు నీళ్లలో ఉడికించి వాడాలి.

❀ దగ్గుకు రాగిని చెట్టు మరియు చమురు కలిపి తీసుకుంటే బాగా పనిచేస్తాయి.

❀ గేదెలకు పుట్టగడ్డ మన్ను, పేడ, సాకగడ్డపూలు మరియు గంజి చక్కని ఫలితాలను ఇస్తాయి.

ఈ గ్రామస్తులు సాధారణంగా ప్రత్యేక సందర్భాలలో మాత్రమే అన్నం వాడుతారు. అన్ని గ్రామాలు సందర్శించిన తరువాత గమనించిన ప్రత్యేక విషయం ఏమిటంటే ఆయా గ్రామాలలోని వృద్ధులు అందరు కూడా చిన్న వయస్సులో గాని, యుక్త వయస్సులోగాని ఎక్కువ అన్నం ఉపయోగించలేదు. కేవలం జొన్న రొట్టెలు, మొక్కజొన్న గటక, పప్పు గటక ●



# వరంగల్ జిల్లా చిట్యాల గ్రామంలో జ్ఞానశోధ

## పట్నాయక్ శాంతికిరణ్, కృష్ణపవన్, రామ్‌నరేష్

## బిట్స్, పిలాని విద్యార్థులు

జూన్ 10 నుండి 19 వరకు జాతీయ పరిశోధనా సంస్థ (ఎన్.ఐ.ఎఫ్.) ఆధ్వర్యంలో హనీబీఏపి వారు నిర్వహించిన 'జ్ఞానశోధ' అనే సామాజిక శిక్షణా కార్యక్రమం గ్రామాలలో, తండాలలో దాగివున్న అపారమైన, అమూల్యమైన జ్ఞాన సంపదను గూర్చి తెలుసుకునేందుకు ఒక చక్కని వేదికను అందించింది. బిట్స్–పిలాని ఇంజనీరింగ్ విద్యార్థులమైన మేము సేకరించిన ఈ విజ్ఞాన సంపద జాతీయ పరిశోధనా సంస్థకు ఎంతగానో తోడ్పడుతుంది. ఈ విధంగా పల్లెవాసుల నుండి సేకరించిన అమూల్య సమాచారాన్ని జాతీయ పరిశోధనా సంస్థ గ్రంథస్తం చేయటం ద్వారా భవిష్యత్ తరాల సమస్యలు ఎదురైతే పరిష్కారానికి దోహద పడుతుంది.

పట్నాయక్ శాంతికిరణ్ అనే నాకు కృష్ణపవన్, రామ్ నరేష్‌లతో కలిపి పల్లెవాసుల పరిజ్ఞానాన్ని సేకరించడానికి వడ్లకొత్తపల్లి, తొర్రూరు మండలంలోని చిట్యాల గ్రామాన్ని కేటాయించారు. వారి ప్రధాన అలవాట్లు, ఆచారాలను సూక్ష్మ పరిశీలనతో తెలుసుకోవ డానికి మాకు మూడురోజులు పట్టింది. ఈ ఆచార వ్యవహారాలు వారి పల్లె జీవితాలను సూర్యున్ని కప్పేసిన మేఘాలలాగే కప్పి వేస్తున్నాయి అని తెలుసుకున్నాం.

చిట్యాల గ్రామం సుమారు 2,500 మంది జనాభా వుంది. అందులో 2000 మంది ఓటర్లు వీరిలో 800 మంది షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందినవారు. ఈ గ్రామంలో ఏకైక విద్యాసంస్థగా వెలుగొందే జిల్లా పరిషత్ పాఠశాలతో అలరారుచున్నది. ఈ గ్రామం పచ్చని పంట పొలాలతో తూర్పు, పశ్చిమాలలో ఆ పల్లెవాసుల పంట పొలాల దాహార్తిని తీర్చేందుకు రెండు నదులతో బహు సుందరంగా, అత్యంత రమణీయంగా విరాజిల్లుతోంది. ఈ గ్రామస్తుల ప్రధాన జీవనోపాధి వ్యవసాయం. కాని, సాంప్రదాయ వైద్య విధానానికి ప్రత్యేకించి నపుంసకత్వం, ఎస్.టి.డి.లు మొదలగు శృంగార సమస్యలకు సంతాన లేమికి ఈ గ్రామం పెట్టింది పేరు.

**సాంప్రదాయ, ఆచార వ్యవహారాలు :**

ఈ గ్రామానికి సంబంధించినంత వరకు అధిక శాతం సాంప్రదాయక ఆచార వ్యవహారాలు వైద్య విధానానికి, వ్యవసాయాని కి సంబంధించినవి. కొన్ని మాత్రం సంస్కృతీ సాంప్రదాయాలకు సంబంధించి వుంటాయి. ఆ గ్రామంలోని వృద్ధుల నుండి చాలావరకు విషయ పరిజ్ఞానాన్ని సేకరించి నిక్షిప్తం చేయడం మాకెంతో సంతోషదాయకమైంది. లేనట్లయితే విలువైన సమాచారం, అపార జ్ఞానం కాలగర్భంలో కలిసిపోయి వుండేది. మేము చేసిన చిట్యాల పర్యటన దీనితో ఫలప్రదమైనదన్న తృప్తి మాకెంతో మిగిలింది.

**వైద్య విధానాలు :**

**బాలింతలకు ఆవుల సోమక్క ఇచ్చిన సమాచారం :**

ఎల్తూరు, తొగర మధువు, గుమ్ముడు చెక్క, చెన్నంగి ఉప్పు చెక్క, వీటన్నింటిని కలిపి నీటిలో ఉడికించి, గట్టిగా పిండి రసం తయారు చేయాలి. దీనిని రోజూ సేవించి నట్లయితే బాలింతలలో కాళ్ళు, చేతులు మొదలగు అవయవాలు సరిగా పనిచేయక పోవడాన్ని నివారించవచ్చు.

తరువాత పిప్పర్లు, వాయుమరాలు, కక్కెరోణి, మంచి మిరియాలు, శొంఠి, మోడి, శృతికాయ మాతర, బైరోణి, చింతమాని వీటన్నింటిని కలిపి పొడిచేసి ప్రతిరోజూ ఉదయం, రాత్రి సుమారు 5 మి.గ్రా. పొడిని తీసుకోవాలి.

ఆహార నియమాలు : కందిపప్పు, చింతకాయ, టమాటా మొదలగునవి వాడాలి. అలాగే అన్నం, గోధుమ రొట్టెలతో ఎల్లిపాయ కారం వాడాలి. నూనె వాడకుండ బదులుగా నెయ్యి వాడవచ్చు.

బాలింతరాలికి జ్వరం వచ్చినట్ల యితే దుంపరాష్ట్రం చెక్కను సానపై చాది రసం తీయాలి. పలుగురాయిని బాగా వేడిచేసి ఈ రసంలో వేసి రసం ఉడికేట్లు చేయాలి. దీన్ని కడుపులోకి తీసుకున్నట్లయితే వాంతులు, విరేచనాలు అయి కడుపు మొత్తం ఖాళీ అయ్యి శుభ్రం చేయబడ్డ తర్వాత జ్వరం తగ్గుతుంది.

**జ్వరం, జలుబు, దగ్గుకు రావుల శశిరేఖ ఇచ్చిన సమాచారం :**

వాము, పసుపు, ఉప్పు, నల్ల ఉసిరి, చినపాపిడి వేరు, ముల్కేరు వీటన్నింటిని పొడి చేసి ఎండబెట్టి సీసాలో భద్రపరచుకుని రోజూ ఉదయం 5 గ్రాములు తింటే జ్వరము, జలుబు, దగ్గు తగ్గుముఖం పడతాయి.

ఎక్కువ జ్వరానికి నల్ల ముల్కేరు పువ్వులు, తమ్మెరు పువ్వులు ఈ రెంటిని ఒక గుడ్డలో తీసుకుని బాగా పిండటం ద్వారా రసం తీయాలి. ఈ రసానికి నల్ల ఉసిరి వేరు,

చిన పాపిడేరు, కరక్కాయ, పసుపు మరియు ఉప్పు కలపాలి. దీనిని తగు మోతాదులో వాడాలి.

**నపుంసకత్వం నివారణకు రాపోలు రాఘవులు ఇచ్చిన సమాచారం :**

మర్రిచెట్టు ఊడలను కాల్చి బూడిద చేయాలి. దీనికి సింగపూరి ఊడిని రాయితో కొట్టి రసం తీయాలి. దీనిని వడకట్టి నాటు సారాతో కలిపి తీసుకోవాలి. ఇది ఓజోమెన్ లాగా పనిచేస్తుంది. అలాగే నల్ల ఉసిరి, ఉప్పు, పసుపు కలిపి మాత్రలలాగా తయారు చేసి ఈ మాత్రలను 7 రోజులు మూడు పూటలా అదయం, మద్యాహ్నం, రాత్రి వాడాలి.

**కామెర్ల వ్యాధికి మందు :**

పచ్చకామెర్లకు 10 కాకర ఆకులు, పావుతులం జీలకర్ర కలిపి రసం తయారు చేయాలి. 20-30 గ్రా. నీటిని వాడవచ్చు. దీనిని వడబోసి వారానికి ఒకరోజు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు తయారు చేసుకొని వాడాలే గాని నిల్వ ఉంచరాదు.

ఆహారం మొదటిరోజు వరి, పచ్చజొన్న రొట్టె, కుదుము మొదలగునవి, రెండవరోజు ఎల్లిపాయ కారం ఉపయోగించ వచ్చు. మూడవరోజు కందిపప్పు, ఎల్లిపాయ కారం, పప్పుచారు, కాకరకాయ, టమోట మొదలగునవి వాడాలి.

**ఉబ్బు కామెర్లు :**

విధానమంతా పైలాగానే కాని కాకర ఆకుల బదులు ఆముదం ఆకులు వాడాలి.

**కట్టి కామెర్లు :**

రాత్రిళ్ళు జ్వరం రావడం, శరీరం సన్నగా ఎండిపోయినట్లు కావడం, ఆకలి లేకపోవడం దీని లక్షణాలు. పైన పేర్కొన్న రెండు విధానాలలో దేనినైనా ఉపయోగించ వచ్చు.

**ఎలాంటి ఇబ్బంది లేకుండా మూత్ర విసర్జన (నొప్పి మందను తొలగిస్తుంది) :**

హంసపాద ఆకు (చెప్పతట్ట ఆకు అనికూడా పిలుస్తారు) రసం తీసి, చక్కెరతో కలిపి మిశ్రమాన్ని 20 గ్రా. కడుపులోకి తీసుకోవాలి. ఇలా మూడురోజుల పాటు రోజూ ఉదయం తీసుకోవాలి.

**వాపు రోగం :**

గంట గల్జేరు ఆకు, నీల గురిమిడి యొక్క అన్ని భాగాలు సమాన పాళ్ళలో కలిపి నీటిలో బాగా ఉడికించి, మగ తాటిచెట్టు గాల (చందు కాయలు) కాల్చిన బూడిదతో కలిపి తీసుకోవాలి. స్నానం చేసే నీటిలో కూడా ఈ రసాన్ని కొంత కలిపి స్నానం చేయవచ్చు.

**స్త్రీల ముట్టు శూల (బహిష్టు అయ్యేముందు వచ్చే నొప్పి) :**

గాడిద గడపాకు నీడలో ఎండబెట్టి దానినుండి రసం తీసి సగం టీస్పూన్ రసానికి 5 గ్రా. ఉప్పు కలపాలి. కాకి దొండగడ్డ (వేరు) ఎండబెట్టి, పొడిచేసి, ఈ పొడిని పాలలో కలుపుకుని రోజూ ఉదయం కడుపులోకి తీసుకోవాలి.

పాతాళ భైరవి చెట్టు ఆకులు నలగ కొట్టి నీటితో కలిపి రొట్టె ముక్కరాగా తయారు చేసి చక్కెరతో కలిపి రోజూ మూడుపూటలా తీసుకోవాలి.

ఆహార నియమం : ఆకు కూరలు, ఉప్పు కారం తగ్గించాలి, మూడు రోజులపాటు గంజి వంచని అన్నం తీసుకోవాలి.

**శ్వాసకు సంబంధించిన సమస్యలు :**

ఉప్పు, నాదెళ్ళ, వాము కలిపి దీనినుండి రసం తీసి ఈ రసాన్ని కడుపులోకి తీసుకోవాలి.

**గనేరియా :**

హంసపాద ఆకులను బాగా దంచి దాని రసం తీసి ఆ రసాన్ని బాగా ఎర్రగా కాలిన పలుగు రాయితో ఉడికించాలి. దీన్ని వడబోసి రోజూ పరగడుపున మూడు రోజుల పాటు తీసుకోవాలి. అలాగే గింజ తీసివేసిన కరక్కాయ బెరడు పొడి చేసి ఆ పొడిని కర్పూరం పొడితో కలిపి, ఈ మిశ్రమాన్ని పరుష జననాంగానికి పూసి కాసేపు గాలికి ఆరనీయాలి.

**స్త్రీలలో కుసుమ వ్యాధులు :**

తెల్ల గుగ్గిలం బాగా పొడిచేసి ఆ రసాన్ని 7సార్లు పొంగించి నురుగు తీసివేస్తూ తెర్లనివ్వాలి. ఈ రసానికి పటిక బెల్లం పొడి కలపాలి. అలాగే పిండి పూలచెట్టు వేర్లను నూరి, ఎర్రగా కాలిన పలుగురాయితో దీని రసాన్ని బాగా మరిగించి మూడు రోజులపాటు కడుపులోకి తీసుకోవాలి. ముదురు వేపాకులు ఎర్రగా వచ్చేంతవరకు ఉడికించి మట్టి పాత్రలో భద్రపరచి రుచికోసం చక్కెర కలిపి మూడు రోజులపాటు వాడాలి.

**వేడి చేస్తే :**

ముసాంబ 3 తులాలు, నల్ల బెల్లం 3 తులాలు కలిపి ఈ ముద్దను మాత్రలుగా చేసి మూడుపూటల కడుపులోకి తీసుకోవాలి. టమోట, వంకాయ, చికెన్, చేపలు, మామిడి, బచ్చలి మొదలైనవి తినకూడదు.

**పక్షవాతం :**

గోరింట లేదా గానుగ ఆకులు 1/4 కిలో, మెత్తగా నూరాలి. దీనికి 1/2 కిలో నువ్వుల నూనె కలిపి బాగా మరగనివ్వాలి. చల్లార్చి, వడబోసి రోజుకు మూడుసార్లు వంటికి మాగా మర్దన చేయాలి.

**నపుంసకత్వానికి చికిత్స :**

మరాటి మొగ్గలు, దుంప రాష్ట్రం, కళింగ రాష్ట్రం, నాగకేసరాలు, గోరోజనం, కుంకుమ పువ్వు మరియు జాజికాయ సమపాళ్ళలో తీసుకోవాలి. ఈ మిశ్రమాన్ని బాగా పొడిచేసి ఈ పొడిని తేనెతో కలిపి నల్లని పేస్టులాగా తయారు చేసి రోజూ మూడు పూటలా తీసుకోవాలి. అలం ముద్దను 50 గ్రా. పరగడుపున రోజూ ఉదయం కడుపులోకి తీసుకోవాలి. నానబెట్టిన మంచి సెనగలు రోజూ ఉదయం, సాయంత్రం తీసుకోవాలి.

**తేలు కాటుకు :**

తేలు కుట్టిన దగ్గర గేదెల గులుమును పూస్తే విషాన్ని లాగేస్తుంది.

**సాంప్రదాయక వ్యవసాయ పద్ధతులు :**

**మోట :** వ్యవసాయ అవసరాలకు బావుల

నుండి నీటిని తోడే విధానం.

**ఏతం :** తక్కువ శ్రమతో బావులనుండి నీటిని తోడే విధానం.

**జీవన పరిణామ పోటీలు :**

చిట్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహించాము. ఈ పోటీలలో విద్యార్థులు సాధ్యమైనన్ని మూలికలు సేకరించి వాటియొక్క ప్రాముఖ్యతను, అవసరాన్ని కనీసం ఒక్కదానిని వివరించాలి. ఇందులో భాగంగా విద్యార్థులు వివిధ రకాల ఆకులు సేకరించడం జరిగింది. చివరగా విజేతలకు స్కెచ్‌పెన్ సెట్లను బహుమతిగా ఇవ్వటం జరిగింది. పిల్లలు సేకరించిన ఆకులు ఈ క్రింద పేర్కొనడమైనది.

**రావి చెట్టు ఆకు :** చలువకు

**రాలెపూలు :** చలువకు

**ముల్కకాయ :** అన్ని రకాల శ్వాస సంబంధమైన సమస్యలకు

**గుంట గల్జేరు :** చమురుతో ఉడికించి, ఆ చమురు తలకు పెట్టుకున్నట్లయితే మంచి, గట్టి, నల్లని జుట్టు వస్తుంది.

**జిల్లేడు :** శరీరంలో ఎక్కడైనా ముల్లు గుచ్చుకుంటే సులభంగా తొలగించవచ్చు. అలాగే నువ్వుల నూనెతో కలిపి కాళ్ళు, చేతులు మర్దన చేస్తే నొప్పులు తగ్గుతాయి.

**ఉత్తరేణి :** ఈ ఆకులను నువ్వుల నూనెతో కలిపి మరిగించి ఆ నూనెను పొట్టపై మర్దన చేసినట్లయితే బొర్ర తగ్గుతుంది.

**కలబంద (అలోవీర) :** కలబంద (ఆకు లోపల వున్న పేస్టు)కు చక్కెర కలిపి తీసుకున్నట్లయితే ఋతుస్రావం తగ్గుతుంది. దీనిని రోజూ ఉదయాన్నే తీసుకోవాలి.

**పిచ్చాకు :** కాలు వాపు, బెణుకడం లాంటి వాటికి ఈ ఆకులు నూరిన ముద్దను మర్దన చేసినట్లయితే ఫలితం కన్పిస్తుంది.

**మల్లె / గన్నేరు :** చంపవాపు, చంప గడ్డలకు ఈ చెట్టు పూలు పూసినట్లయితే ఉపశమనం ఇస్తుంది.

**బంతి :** తేనెటీగల కాటుకు పని చేస్తుంది.

**వంటల పోటీలు :**

వనగుజ్జు లక్ష్మి అనే 70 సంవత్సరాల వృద్ధ మహిళ పరమ రామ భక్తురాలు అత్యుత్సాహంగా ఈ పోటీలో పాల్గొని 30 సంవత్సరాల క్రితం వాడుకలో వున్న రెండు రకాల పచ్చళ్ళను తయారు చేసి రుచి చూపించి బహుమతి గెలుచుకుంది. అవి 1. రాలెపువ్వు పచ్చడి, 2. బుడ్డగాసె పచ్చడి. ఈ పచ్చళ్ళు రెండుకూడా మంచి రుచి, ఔషధ లక్షణాలు కలిగి వున్నాయి. ఈ పచ్చళ్ళతో ఆవిడ మాకు స్వయంగా, ఆప్యాయంగా వండి వడ్డించడం ఆనందంగా వుంది.



**సన్మానాలు :**

వారి విజ్ఞానానికి, కృషికి అభినందనగా వైద్య సేవే వృత్తిగా కల్గిన పెద్ద వ్యక్తి రాపోలు రాఘవులును శాలువతో సత్కరించాం. ఆ గ్రామంలో ఎంతోమంది మాకు సహకరించినప్పటికీ మేము రాఘవులు గారినే ఎందుకు ఎంపిక చేసుకున్నామంటే మా సిద్ధాంతమైన విజ్ఞానాన్ని పంచుకోవడం అనేదాన్ని అతను తు.చ. తప్పకుండా పాటిస్తారు. తనకు తెలిసి జ్ఞానాన్ని అది పది కాలాలపాటు నిలిచి ఉండి సమాజ హితానికి తోడ్పడేదిగా ఉండాలని పదిమందితో పంచుకోవాలని చూడటంలో ముందుంటాడు. కాని ఎలాంటి స్వార్థచింతన ఉండదు. అందుకే అతనిని ఈ సన్మానానికి ఎంపిక చేసుకున్నాం. అంతే కాకుండా అతని ముఖ్య ఉద్దేశ్యం అతని మాటలలోనే "నాతో ఇదంతా పోకుండా జనాలకి ఉపయోగపడాలి" ఈ సిద్ధాంతమే మాకు ఎంతో నచ్చింది. తన జ్ఞానం కాలగర్భంలో కలిసి పోకుండా దానిని అక్షర రూపంలో బంధించి భావి తరాలకు అందించే మాలాంటి వారి కోసమే ఎదురు చూస్తున్నాను అని అంటారు శ్రీ రాఘవులు. వయస్సు మీద పడటం మూలంగా అన్ని మర్చిపోతున్న స్థితిలో వున్న అతని వద్దకు పోవడం మా అదృష్టంగా భావిస్తున్నాం. ఆ గ్రామంలో మేము కలిసిన వారందరిలో రాఘవులు గారు ఇంతకు మించిన సత్కారానికి అర్హులు. అందుకే మేము ఈ సన్మానానికి ఆయనను ఎంపిక చేసుకుని ఉచితరీతిని సత్కరించాము. ●

# చిన్నవిగా వుంటేనే స్థిరంగా మనగలుగుతాయా?

అడవి చివరలో ఒక మహావృక్షం ఉంది. దాని కొమ్మలు, వేళ్ళూ రాజసంతో నలువైపులా విస్తరించి వున్నాయి. దాని ఆకులు ఎండనుంచి ప్రజలకు చల్లని నీడనివ్వటమే కాక, అసంఖ్యాకమైన పక్షులకి, చిన్న జీవులకు ఆశ్రయం కల్పిస్తోంది. అది ఎల్లప్పుడూ సందడిగా ఉండేది. ఆ చెట్టు వేళ్ళదగ్గర ఒక చిన్న మొక్క మొలిచింది. అది నాజూకుగా బలహీనంగా ఉండి, సన్నటి గాలి వచ్చినా వంగిపోయేది.

ఒకరోజు మహావృక్షం, చిన్నమొక్క మాట్లాడుకుంటున్నాయి. వృక్షం ఇలా అంది "ఒరే చిన్నోడా! నువ్వూ నాలాగే పాదాలు భూమిలోకి చొప్పించి, తలని గర్వంగా గాలిలోకి ఎత్తి వుంచవేం!". మొక్క నవ్వుతూ "ఆ అవసరం నాకేం కనిపించలేదు, నా ఉద్దేశ్యంలో ఇదే క్షేమమని అనుకుంటాను" అని సన్నగా జవాబిచ్చింది.

వృక్షం ఎగతాళిగా "క్షేమమా! నువ్వు నాకన్నా క్షేమంగా వున్నానంటున్నావా? నా వేళ్ళు భూమిలో ఎంత లోతుకున్నాయో తెలుసా? నా మొండెం ఎంత లావుగా బలిష్టంగా వుందో చూసావా? ఇద్దరు మనుషులు చేతులు చాచి నన్ను కావలించు కున్నా వాళ్ళ చేతులు కలవవు తెలుసా? నన్ను వేళ్ళతో సహా పెకిళించి, నా తలని భూమ్మీదకు వంచే శక్తి, దమ్ము ఎవరికుంటాయి?" అని తలెగరేసింది గర్వంగా.

కొంత కాలానికి వృక్షం పశ్చాత్తాప పడాల్సి వచ్చింది. ఓ సాయంత్రం ఆ ప్రాంతంలో పెద్ద తుఫాను వచ్చింది,దాదాపు అడవంతా నాశనమైంది. ఆ తుఫాను ఈ మహా వృక్షాన్ని కూడా కూల్చి దూరంగా విసిరేసింది. తుఫాను ఉధృతి తగ్గాక ఆ ఊరి ప్రజలు జరిగిన బీభత్సాన్ని చూశారు. ఆకాశాన్ని అంటుకున్నట్టుగా వుండే మహా వృక్షాలెన్నో ముక్కలు చెక్కలై చిందరవందరగా పడివున్నాయి. అడవంతా వీటి అవశేషాలతో నిండిపోయింది.

దీనికి భిన్నంగా వుంది ఆ చిన్న మొక్క. తుఫాను గాలికి ఆ మొక్క అటూ ఇటూ ఊగి వంగిపోయినా, తుఫాను ఉధృతి తగ్గగానే తను పూర్వంలాగే నిటారుగా నిలిచింది.

మనకన్నా బలవంతుడైన శత్రువును జయించాలంటే మనం వంగక తప్పదు. ఇలా వంగిపోవటం చిన్నతనమా?! లేక తెలివైన పనా?!!



హింసతో కూడుకున్న ఈ ప్రస్తుత పరిస్థితుల్లో చాలా గిరిజన తాండాలు చిన్న చిన్న ప్రాంతాలు, ప్రభుత్వ అండతో పెద్ద పెద్ద కంపెనీలు గనుల త్రవ్వకాలు, పర్మిట్ల పేరుతో చేసే దాడిని తట్టుకోలేక పోతున్నాయి. చిన్న విజ్ఞానం కలవారు, పరంపరాగత విజ్ఞానం కలవారు, వనరులను సంరక్షించేవారికి ఈ పెద్ద సంస్థలతో ఏవిధమైన సంబంధమూ లేదు. అవి చేసే ఏ చిన్నపాటి పర్యావరణ ధ్వంసాన్న యినా నివారించే శక్తి వీరికి లేదు. శ్రీ రిపిన్ కాల్రా చిత్రించిన ఈ బొమ్మలో చివరికి విజయం చిన్నవాటిదే. చిందర వందర గా వున్నా, ముక్కలైనా కలిసివున్న సమాజాలకే అని తెలియజేస్తుంది. ఈ బొమ్మలోని ఎడమవైపున వున్న భాగాల గీతలు స్పష్టంగా కనిపిస్తాయి. కాగా, కుడివైపు భాగాన చిన్న చిన్న వివరాలను తుడిచి పెట్టేలా బంతి దొర్లుతూ వున్నది. అవి అస్పష్టంగా కూడా వున్నాయి. చరిత్ర క్రమంలో అవి మరుగున పడిపోతాయి. ఇది మన ఊహాగానమా? అయివుండవచ్చు!! అయితే ప్రకృతిలోని సమతుల్యాన్ని పట్టించు కోని శక్తులకు వ్యతిరేకంగా, భవిష్యత్తులో ప్రకృతితో కలిసి బ్రతకాలనుకున్న వారు ఇలా ఊహించుకోవటంలో తప్పులేదు.

('హనీబీ' ఆంగ్లపత్రిక సౌజన్యంతో)

## 'రోషన్ లాల్ విశ్వకర్మ' ఇన్నోవేషన్

# కణుపులతో చెఱకు నాటులో వృధాను అరికట్టే సాధనం



బీహార్ రాష్ట్రానికి చెందిన 'రోషన్ లాల్ విశ్వకర్మ' చెఱకు నాటడంలో ప్రస్తుతం వినియోగిస్తున్న విధానాన్ని చూసి, అందులో జరుగుతున్న వృధాను ఎలా అరికట్టాలా అని ఆలోచించి ఓ చిన్న, అద్భుతమైన సాధనాన్ని కనిపెట్టాడు. ఈ సాధనం వినియోగంతో ఎంతో చెఱకును ఆదా చేయడంతో పాటు ఆ చెఱకును మళ్ళీ పాకం తీయటానికి వినియోగించి రైతులు లాభాలను ఆర్జిస్తున్నారు.

మామూలుగా చెఱకు నాటుటకు చెఱకు గడలను ఒకటి లేదా అరఅడుగు చొప్పున ముక్కలు చేసి ఆ ముక్కలను పొలంలో నాటడం ప్రస్తుతం జరుగుతున్న విధానం. ఈ విధానాన్ని శ్రద్ధతో పరిశీలించిన విశ్వకర్మ చెఱకు నాటడం వల్ల ఆ చెఱకులోని కణుపుల వద్ద మాత్రమే మొలకలు వస్తాయని గ్రహించాడు. అంటే మొలకెత్తే భాగం కేవలం కణుపు మాత్రమే. మిగతా చెఱకు అంతా వృధాగా పోతోంది అని గ్రహించాడు. తన ప్రయోగాన్ని ప్రారంభించి చెఱకులోని కణుపును మాత్రమే కత్తిరించి నాటగా అవి మొలకెత్తాయి.

వాటిని పాలిథిన్ బ్యాగుల్లో నాటి మొక్కలు కొద్దిగా పెద్దవైన తర్వాత పొలంలో




చెఱకు కణుపులను కత్తిరించే యంత్రం



చెఱకు గెడలనుండి కణుపులను వేరు చేయడం





**కణుపులను విత్తనశుద్ధి చేయడం**

**కణుపులను వేరు చేసిన తర్వాత మిగిలిన చెఱుకును బెల్లం తయారీకి ఉపయోగించుకోవచ్చు**

నాటి తన ప్రయోగంలో విజయం సాధించాడు. ఇక ఈ కణుపులను కత్తిరించేందుకు ఒక సాధనం వుంటే బావుంటుందని గ్రహించి ఆ సాధనం తయారీకి ఉపక్రమించాడు. చెఱుకు గడలో కేవలం కణుపును మాత్రమే కత్తిరించేలా అర్ధచంద్రాకారంలో చిన్న ముక్క వచ్చేలా సాధనాన్ని కనిపెట్టాడు. ఈ సాధనం ద్వారా ఒక వ్యక్తి సునాయాసంగా కూర్చునే చెఱుకు గడలలోని కణుపులను కత్తిరించవచ్చు. ప్రతి కణుపునుండి రెండు అర్ధచంద్రాకారంలో ముక్కలు తయారవుతాయి. ఈ రెంటినీ మొక్కలు పెంచుటకు ఉపయోగించవచ్చు. ఈ విధంగా చెరుకు చాలా ఆదా అవుతుంది. కణుపులు కత్తిరించిన తర్వాత మిగిలిన చెఱుకును మళ్ళీ గానుగలో వినియోగించి రసాన్ని తీసుకోవటం ద్వారా 75 శాతం చెఱుకు మళ్ళీ వినియోగంలోకి వస్తుంది.

చెఱుకు గడనుండి వేరుచేసిన కణుపులను విత్తనశుద్ధి చేసి, ఒక పాలిథిన్ సంచిలో నాటాలి. అవి బాగా మొలకెత్తిన తర్వాత వాటిని తీసి పొలంలో నాటాలి. ఇలా చేయటం ద్వారా చెఱుకు పొలం కూడా అంతా సమానంగా వుండటంతో పాటు చెఱుకు దిగుబడి కూడా ఎక్కువగానే వస్తున్నట్టు సమీప రైతులు తెలియజేశారు. అంతే కాకుండా పాలిథిన్ సంచుల్లో కాని, ప్లాస్టిక్ గిన్నెల్లో కాని పెంచడం వల్ల ఎంతో నీరు ఆదా చేయవచ్చు. తక్కువ స్థలంలో ఈ నర్సరీ పెరుగుతుంది కాబట్టి దగ్గరుండి మొక్కల పెరుగుదలను గమనిస్తూ, పురుగుల నుండి కూడా రక్షించుకోవడం సులభమవుతుంది.

వృధాగా పోయే చెఱుకు వినియోగించుకోవటంతో రైతులు ఎంతో ఆనందంతో ఉన్నారు. ఈ పద్ధతి ద్వారా చెఱుకు తోట చాలా క్రమపద్ధతిలో పెరుగుదల వుంటుందని అంటున్నారు. మన రాష్ట్రంలోని రైతులు కూడా ఈ పద్ధతిని వినియోగించడం ద్వారా చెఱుకు ఆదాతో పాటు మంచి దిగుబడులను కూడా సాధించాలని 'పల్లెసృజన' కోరుకుంటోంది.

ఈ సాధనం కావలసిన వారు ఎన్.ఐ.ఎఫ్. ఇన్నోవేటర్ రోషన్‌లాల్ విశ్వకర్మ ఫోన్ నెం. 093007 24167ను సంప్రదించి గాని, లేదా పల్లెసృజన కార్యాలయాన్ని సంప్రదించి గాని ఈ పరికరాలను పొందవచ్చు. ఖరీదు కూడా చాలా స్వల్పంగానే వుంటుంది. రాష్ట్రంలోని రైతాంగం ఈ పరికరాన్ని ఉపయోగించుకుని ఇంకా లాభసాటి వ్యవసాయం చేయగలరని ఆశిస్తున్నాము. ●



**శుద్ధి చేసిన కణుపులను పాలిథిన్ బ్యాగులలో నాటాలి**



**పొలంలో నాటుతున్న చెఱుకు మొక్కలు**



**సుమారు 5 నెలల తర్వాత ఏపుగా పెరిగిన చెఱుకు పంట**




పురుగులు మరియు తెగుళ్ళ నివారణలో వివిధ రకాల కషాయాలు :

**పురుగుల జీవిత చరిత్ర :**

భూమిపై మానవునికంటే అనేక వేల సంవత్సరాల ముందునుండి పురుగులు ఆహారంకోసం మొక్కలపై ఆధారపడి జీవిస్తున్నాయి. తరువాత ఆహారంకోసం మానవుడు వ్యవసాయం ప్రారంభించాడు. తద్వారా మొక్కలపైన ఆధారపడ్డ పురుగులు




కూడా పంట పొలాలను ఆశించి పంటను నాశనం చేస్తున్నాయి. సహజ సస్యరక్షణ పద్ధతులు అవలంభించడం ద్వారా పురుగుల ఉధృతిని అదుపులో పెట్టవచ్చు. దీనిద్వారా మిత్ర కీటకాలు పెరిగి అవికూడా శత్రు పురుగులను కొంతవరకు అదుపులో ఉంచుతాయి.

**పంటను ఆశించే చీడపురుగు :**

పంటను ఆశించే చీడపురుగులను రెండు వర్గాలుగా విభజించవచ్చు.

1. రసం పీల్చే పురుగులు,
2. గొంగళి పురుగులు.

**1. రసంపీల్చే పురుగులు :**

లేత ఆకులు, కాండం, పువ్వుల నుంచి రసం పీలుస్తాయి. దీనివలన ఆకులు ముడతలు పడి ఎదుగుదల ఆగిపోతుంది. కొన్ని పంటలలో ఇవి వైరస్ తెగుళ్ళను కూడా కలిగిస్తాయి. ఈ పురుగులలో ప్రధానంగా మూడు దశలుంటాయి. అవి ఎ) లార్వాదశ, బి) పిల్లపురుగు (డింభకం), సి) తల్లిపురుగు.

**2. గొంగళి పురుగు :**

ఇది ఆకు, కాండం, పూలు మరియు కాయలు తింటుంది. ఈ పురుగు జీవిత చక్రంలో 4 దశలుంటాయి. అవి

ఎ) గుడ్డు దశ,
బి) లార్వాదశ,
సి) ప్యూపాదశ మరియు
డి) రెక్కల పురుగు (తల్లిపురుగు).

**చీడ పురుగుల నివారణలో ఉపయోగించే కషాయాలు:**

చీడ పురుగుల యాజమాన్యంలో వివిధ రకాల వృక్ష సంబంధ కషాయాలు వాడటం ద్వారా పురుగుల బారినుండి పంటలను కాపాడుకొనవచ్చు. వీటి వినియోగం వలన పర్యావరణానికి హాని ఉండదు. అంతే కాకుండా మిత్ర కీటకాల నష్టం జరగదు. కషాయాలలో వాడే వివిధ వస్తువులు గ్రామాలలోనే లభ్యమౌతాయి. కాబట్టి సాగుకయ్యే ఖర్చులను తగ్గించవచ్చు.

వృక్షసంబంధ కషాయాలు వాడటం వలన పురుగుల జీవిత చక్రంలోని వివిధ దశలను నిర్మూలించవచ్చు.

**5% వేపపప్పుద్రావణం**

**తయారుచేసే పద్ధతి :**

నీడలో బాగా ఎండిన వేపగింజల నుండి తీసిన 5 కిలోల పప్పును 10 లీటర్ల నీటిలో నాలుగు గంటలు నానబెట్టాలి. వేపగింజల పప్పును మెత్తగా రుబ్బి ఒక మూటలో కట్టి (10 నుండి 12 గంటలు) నానబెట్టాలి. ఆ నీటిలో మూటను ముంచి పట్టుకుని 15 నుంచి 20 నిమిషాలపాటు పిండుతూ ద్రావణం తీయాలి. ఈ ద్రావణం ఘాటైన వేప వాసనతో పాలలాగా ఉంటుంది. ఈ ద్రావణాన్ని పలుచని గుడ్డలో వడపోసి 100 గ్రాముల సబ్బుపొడి కలపాలి. ఈ విధంగా తయారైన ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరం పొలంలో సాయంత్రంపూట పిచికారి చేయాలి. పంట దశను బట్టి, పురుగుల ఉధృతిని బట్టి కషాయం మోతాదు పెంచుకోవాలి.

**నివారిపబడు పురుగులు :**

రసం పీల్చే పురుగు, ఆకుముడత పురుగులు, పొగాకు లద్దె పురుగు, పచ్చపురుగు, ఆకునమిలే పురుగు.

**పనిచేసే విధానం :**

1. పురుగు గుడ్డు దశలో పిచికారి చేస్తే గుడ్డు పొదగకుండా చెడిపోతుంది.
2. పురుగు లార్వా దశలో పిచికారీ చేస్తే పురుగు ఆహారం తినడం మానివేసి నెమ్మదిగా చనిపోతుంది.
3. ఒక లార్వాదశ నుండి ఇంకొక దశకు అభివృద్ధి చెందకుండా చేస్తుంది.
4. ప్యూపాదశ నుండి రెక్కల పురుగు (తల్లిపురుగు) విడుదల కాకుండా చేస్తుంది.

**సూచన :**

నీడలో బాగా ఎండిన వేపగింజల పొడిని కషాయం తయారు చేయడం కోసం ఉపయోగిస్తే 10-15 కిలోల వేపపొడి



అవసరం అవుతుంది.

**వేపగింజల వినియోగంలో తీసుకోవలసిన జాగ్రత్తలు :**

1. వేపకాయ పండి, చెట్టునుండి రాలిన వేప పళ్ళను మే, జూన్ నెలల్లో సేకరించాలి.
2. వేపగింజలను ఎప్పటికప్పుడు పండ్లనుండి వేరుచేసి నిలువ చేయాలి.
3. వేపగింజలను నీడలో ఆరనివ్వాలి.
4. వేపగింజలను పలుచటి గోనెసంచులలో గాలి, వెలుతురు వచ్చే ప్రదేశంలో నిలువచేయాలి. ఈ విధంగా జాగ్రత్త చేసిన వేపగింజలు ఒక సంవత్సర కాలం వరకు ఉపయోగపడతాయి.

**వేప పప్పు ద్రావణం వల్ల లాభాలు :**

1. పంట పూతదశలో కషాయం పిచికారి చేస్తే తల్లి పురుగులు వేప వాసనకి పంటపై గుడ్లు పెట్టవు.
2. వేప ద్రావణం చల్లిన ఆకులు చేదుగా అండటం వలన పిల్ల పురుగులు (లార్వాలు) ఆకులను తినలేవు.
3. వేప పప్పు ద్రావణం పురుగు గుడ్డు దశమీద, పిల్ల పురుగుల దశమీద బాగుగా పనిచేస్తుంది.
4. వేపలో ఉండే "అజాడిరెక్టిన్" అనే మూల పదార్థం పురుగు జీవిత దశపై ప్రభావాన్ని చూపిస్తుంది.
5. వేప ద్రావణంలో ఉన్న అనేక "లిమోనాయిడ్స్" పంటను ఆరోగ్యవంతంగా ఉంచడానికి సహాయ పడతాయి.
6. వేప ద్రావణం మానవుల ఆరోగ్యానికి, మిత్ర కీటకాలకు, పర్యావరణానికి హాని చేయదు.

**ఎన్నిసార్లు వాడాలి? :**

పంట దశ, పురుగుల ఉధృతిని బట్టి వేప ద్రావణాన్ని వాడవలసి వుంటుంది. ఈ ద్రావణాన్ని

1. అన్ని పంటలలోను వాడవచ్చు.
2. వరి పంటలో ఒకటినుండి రెండుసార్లు వాడవచ్చు.
3. మిరప, ప్రత్తి వంటి పంటలలో పురుగుల తీవ్రతను బట్టి 3 నుండి 4 సార్లు వాడవచ్చు.
4. వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు, కూరగాయల లో 1 నుండి 2 సార్లు వాడవచ్చు.
5. అపరాలలో 1 నుండి 2 సార్లు వాడుకోవచ్చు.

**వేప ఇతర ఉత్పత్తులు :**

1. వేపనూనె,
2. వేపపిండి,
3. వేప కషాయం.

**గమనిక :**

100 గ్రాముల సబ్బుపొడి కలవడం వలన ద్రావణం మొక్కకు పట్టి ఉంటుంది. ఒకేసారి నేలమీదకు జారిపోదు. సబ్బు పొడికి బదులు అరకేజి కుంకుడు పొడి కలిపితే మరీ మంచిది.

**(మూలం : జట్టు ట్రస్టు (కపార్ట్ ప్రోగ్రాం)**

# ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు

## దానిమ్మ ఆకులతో పశువైద్యం

చిన్న, పెద్ద పశువులు, గొర్రెలలో నులిపురుగుల నివారణకు గుజరాత్ రాష్ట్రానికి చెందిన, బారోచ్ జిల్లాలోని, కంబుడి గ్రామవాసి పిల్జుభాయ్, ఉగ్రాభాయ్ వాస్వాలు దానిమ్మ ఆకులతో నివారణ మార్గాన్ని కనిపెట్టారు. వంద గ్రాముల దానిమ్మ ఆకులను, వంద గ్రాముల వేప ఆకులను మెత్తగా నూరి, 400 మి.లీ. నీటిలో ఒక గంటసేపు నానబెట్టి ఈ ద్రావకాన్ని వాడేముందు బాగా కలిపి పశువుకు రోజుకు



ఒకసారి చొప్పున రెండు మూడు రోజులు పట్టిస్తే నులిపురుగుల నుండి పశువు పడే బాధను నివారించవచ్చు.

## వేప ఆకులు, మజ్జిగతో క్రిమి సంహారిణి

గుజరాత్‌కు చెందిన పురుషోత్తం భాయ్, పంటలలో క్రిమి కీటకాల నివారణకు వేప ఆకులు, మజ్జిగ కలిపి పంటలపై పిచికారి చేస్తారు. దీనికై 200 గ్రాముల వేపాకు రసాన్ని నీటితో కలిపి మూడోవంతు మిగిలేదాకా ఉడికించి దీనిలో 1500 మి.లీ. తేరిన మజ్జిగను కలిపి పంటలపై పిచికారి చేస్తారు. దీనివల్ల చాలావరకు పంటలలో క్రిమి కీటకాలు నివారించబడతాయి అంటారు.



మజ్జిగ, నీరు 1 : 5 దామాషాలో కలిపి, పత్తి పంటలో పిచికారి చేస్తే రసంపీల్చే పురుగులను నివారించవచ్చునని కూడా అంటున్నారు.

## ఆముదం, సజ్జ పిండితో వెల్లుల్లి పంట రక్షణ

భారతదేశ సుగంధాల బోర్డు గుజరాత్‌లో 2002-03 నుండి 2006-07 మధ్యలో వెల్లుల్లి ఉత్పత్తి 48% పెరిగిందని తెలియజేసింది. గుజరాత్‌లోని జునాగఢ్



జిల్లాలో అత్యధిక ఉత్పత్తి జరుగుతోంది. దీనికి కారణం తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి చేయాలన్న ఇక్కడి రైతుల సామూహిక కృషి కారణం. ఈ ప్రాంతానికి చెందిన పురుషోత్తం భాయ్ మజ్జిగ, ఆవుమూత్రం, పాత సజ్జ పిండి కలిపి వెల్లుల్లి పంటపై పిచికారి చేసి మంచి ఉత్పత్తితో పాటు క్రిమి కీటకాలు రాకుండా మంచి ఫలితాలు సాధించారు.

అదే ప్రాంతానికి చెందిన రమేష్ భాయ్ ఆముదము, నీళ్ళు, క్యాస్టిక్ సోడా కలిపి క్రిమి సంహారిణిగా ఉపయోగించారు. దీనికై ఒకటిన్నర లీటర్ల ఆముదాన్ని 100 గ్రా. క్యాస్టిక్ సోడాను, 20 లీటర్ల నీటితో కలిపి పంటపై రెండుమూడు సార్లు పిచికారి చేస్తే క్రిమి కీటకాల నుండి పంటను కాపాడు కోవటమే కాక, మంచి దిగుబడులను కూడా సాధించవచ్చు అంటున్నారు.

## మిరప పంటలకు పొగాకు, నిమ్మ రసంతో సస్యరక్షణ

గుజరాత్‌లోని జునాగఢ్ జిల్లా, అజబ్ గ్రామానికి చెందిన పురుషోత్తం భాయ్, దేవ్‌జీ భాయ్, కళారియాలు తమ మిరప పంట సస్యరక్షణకై రెండు కిలోల పొగాకు నుశిని, రెండు కిలోల కలబంద ఆకు గుజ్జును, 250 గ్రాముల నిమ్మ రసాన్ని 20 లీటర్ల నీటితో కలిపి మరిగించి, కషాయాన్ని తయారు చేశారు. 250 మి.లీ. కషాయాన్ని 15 లీటర్ల నీటిలో కలిపి వారం రోజుల తేడాతో రెండుమూడుసార్లు మిరప పంటపై పిచికారి చేస్తారు. దీనివలన మిరప పంటను ఆశించే క్రిములు 70 నుండి 80 శాతం వరకు నివారించవచ్చు అంటున్నారు పురుషోత్తం భాయ్, దేవ్‌జీ భాయ్, కళారియాలు.

## ఆముదపు పంటలో ఆకుచుట్టు తెగులు నివారణ

గుజరాత్ రాష్ట్రంలోని బనష్ కంటా జిల్లాలోని జలోల్ గ్రామానికి చెందిన అర్జున్ భాయ్, బల్లబ్ భాయ్, దర్బార్‌లు ఆముదపు పంటలో వచ్చే ఆకుచుట్టు తెగులు నివారణకు గొర్రెల మూత్రం, వేప ఆకులు, నీరు వాడి

సత్ఫలితాలను పొందారు. వారు రెండుమూడు లీటర్ల గొర్రె మూత్రాన్ని వడగట్టి అందులో రెండు కిలోల వేప ఆకులను కలిపి ఒక ఇనుప తొట్టెలో అవి చిక్కబడేదాకా ఉంచుతారు. ఈ ద్రావకాన్ని 1:30 దామాషాలో నీటితో కలిపి ఆముదపు పంటపై పిచికారి చేశారు. దీంతో ఆకుచుట్టు తెగులు నివారించబడింది.

## పశువులపై పిరుదుల నివారణ

కమలాపండ్ల చెట్టు లేత ఆకులను తీసుకుని రసాన్ని తయారు చేసి ఒక మట్టి కుండలో రెండురోజులపాటు వుంచి, ఆ ద్రావకాన్ని పశువులలో పిరుదులున్నచోట



రాసి రెండురోజులపాటు వదిలేస్తే పిరుదులు వాటంతట అవే రాలిపోతాయి. ఈ పద్ధతిని ఒరిస్సా రాష్ట్రంలోని సుందర్‌ఘడ్ జిల్లా ఆదివాలు ఉపయోగిస్తారు.

## పారుకుంటున్న పశువులకు ఆయుర్వేద మందు

కడుపులో నులిపురుగుల కారణంగా పశువులు పారుకొనుటను మనం గమనిస్తుంటాం. ఒక్కోసారి వాటి పేడలో పురుగులు కూడా పడుతుంటాయి. ఈ వ్యాధి నివారణకు ఒరిస్సా రాష్ట్రంలోని కోరాపూర్ జిల్లావాసి భగవాన్ ఫరీదా ఒక ఆయుర్వేద మందును కనుగొన్నాడు. రెండు గుప్పిళ్ళ గుమ్మడి ఆకులను పనస ఆకులతో కలిపి నూరి వాటి



మిశ్రమాన్ని రోజుకు ఒకసారి మూడు రోజుల పాటు పశువుకు తినిపిస్తే పశువులు పారుకొనుట తగ్గిపోతుందని అంటున్నారు.

## పశువుల గాయాల నివారణకు నారింజ ఆకులతో వైద్యం

ఒరిస్సా రాష్ట్రంలోని మయూర్‌బంజ్ జిల్లా ఆదివాసులు పశువుల గాయాలను మాన్పడానికి నారింజ ఆకులతో వైద్యం చేస్తారు. ఈ ఆకులను కొన్నింటిని తీసుకుని బాగా నూరి పశువుకు గాయమైన చోట పెడతారు. దీంతో పుండు త్వరగా మానటమే కాక, దానిచుట్టూ క్రిములు రాకుండా నివారిస్తుంది.

## మోదుగ గింజలతో పశువులకు చికిత్స

ఒరిస్సాకు చెందిన లక్ష్మణ్ నాయక్ తన పశువులకు పట్టిన పిరుదులను తీసివేయటానికి మోదుగ గింజలను మెత్తగా నూరి కొద్దిగా తేమతో తడిపి పశువులకు



పిరుదులున్నచోట రోజుకొకసారి చొప్పున రెండు మూడు రోజులు పట్టిస్తే అవి రాలిపోయాయి.

## పశువుల, మనుషుల కీళ్ళ నొప్పులకు మందు

పశువులకు, మనుషులకు తరచూ వచ్చే కీళ్ళనొప్పులకు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మయూర్‌భంజ్ జిల్లావాసి బలరామ్ సింగ్ పల్లేరు కాయలను నూరి అందులోంచి



వచ్చిన నూనెను నొప్పులున్నచోట పూస్తే ఎంతటి నొప్పినైనా త్వరగా తగ్గిస్తుందని తెలియజేస్తున్నారు.

## క్యారెట్‌ను శుభ్రం చేసే యంత్రం

తమిళనాడుకు చెందిన 59 సంవత్సరాల నాచముత్తు అనే వ్యక్తి తన ఆరెకరాల పొలంలో క్యారెట్, బఠాని, ఆలుగడ్డ, నారింజ, బీట్‌రూట్, అరటి, బీన్స్ తదితర పంటలను పండిస్తాడు. చాలామంది రైతులు క్యారెట్‌ను పండించిన తర్వాత వాటిని తీసి వాటికున్న మట్టి పోవటానికి గోనె సంచుల్లో నింపి పారే నీటిలో కడుగుతూ వుంటారు. ఇది చాలా సమయంతో పాటు కష్టంతో కూడుకున్న పని. ఈ సమస్య నివారణకు నాచముత్తు ఒక నమూనా యంత్రాన్ని 2003లో కనుగొన్నాడు. ఈ యంత్రంలో 350 కిలోల క్యారెట్‌ను ఒకేసారి

వేసి శుద్ధి చేయవచ్చు. ఈ యంత్రాన్ని నడపటానికి 3 హార్స్‌పవర్‌ల ఆయిల్ ఇంజన్ అవసరమౌతుంది. 4 ఎకరాల పంటను శుద్ధి చేయడానికి గతంలో ఆరుమంది చేసే పనిని ఈ యంత్రం సహాయంతో కేవలం ఇద్దరు వ్యక్తులు చేయగలుగుతున్నారు.

## మామిడి పళ్ళను నాశనం చేసే తెల్లదోమల నివారణ

కర్నాటకకు చెందిన చిత్రదుర్గవాసి మహావీర్ మామిడి పళ్ళకు సోకే తెల్లదోమల నివారించడానికి ఆగ్నేయాస్త్రం లాంటి మందును కనిపెట్టాడు. దీనిని తయారు చేయటానికి అతను 5 కిలోల వేప ఆకులను, 2 కిలోల పొగాకు పొడిని 3 కిలోల వెల్లుల్లి, 4



కిలోల పచ్చి మిరపకాయలు, 20 లీటర్ల ఆవు మూత్రంతో కలిపి 20 రోజులు మురగబెట్టి, ఆ ద్రావకానికి 200 లీటర్ల నీటిని కలిపి చెట్లపై పిచికారి చేశాడు. దీంతో మామిడి పండ్లను ఆశించే తెల్లదోమలు సమర్థవంతంగా నివారించ బడ్డాయి.

## వనరాజా జాతి కోళ్ల ప్రాముఖ్యత

గ్రామీణ ప్రాంతా ప్రజలు పెరటి దొడ్లలో పెంచుకోవడానికి అనుకూలమైన కోడిజాతి "వనరాజా". ఈ జాతి కోళ్లు గ్రామీణ ప్రాంతానికి, ముఖ్యంగా ఇంటిచుట్టు ప్రక్కల గల ఖాళీ ప్రదేశాలలో పెరటి దొడ్లలో పెంచుకోవడానికి చాలా పనికి వస్తాయి. మొదటి నాలుగు వారాలు తగు ఉష్ణోగ్రత, దాణా మరియు వ్యాధి నిరోధక టీకాలు అందించాలి. వీటికి ప్రత్యేకమైన దానాను వాడనవసరం లేదు. ఇంటి చుట్టు ప్రక్కల లభ్యమయ్యే ధాన్యపు గింజలు, గడ్డి గింజలు, ఆకులు, అలములు, నూకలు, పురుగులు, వంటింటి మిగులు పదార్థాలు మొదలైన వాటిని తినగలవు. ఇవి మామూలు కోళ్ళవలె కాక అనేక ఆకర్షణీయమైన రంగులలో లభ్యమగుచున్నవి. ఇవి ఎక్కువ బరువు, ఎక్కువ మాంహము గల పుంజునకు మరియు ఎక్కువ గ్రుడ్లు పెట్టే సామర్థ్యముగల పెట్టలకు సంపర్కము చేయగా వచ్చినవి. అందువల్లనే ఈ వనరాజా కోళ్ళు ఎక్కువ బరువు మరియు గ్రుడ్లు పెట్టగలిగే సామర్థ్యం కలిగి వున్నాయి.

వీటి ప్రత్యేకతలు వివిధ ఆకర్షణీయ మైన రంగుల ఈకలు, మంచి మనుగడ సామర్థ్యం, మంచి మేత వినిమయ సామర్థ్యం, తక్కువ ఖర్చుతో కూడిన పెంపకం, పెద్ద గ్రుడ్డు పరిమాణం, అధిక వ్యాధి నిరోధకత దేశవాళీ కోళ్ళచే గుడ్లను పొదిగించుకోవచ్చు.

కావలసిన వారు సమీపంలోని పశుశాస్త్ర విభాగం, బి.సి.టి. కృషి విజ్ఞాన కేంద్రాలను సంప్రదించి వీటిని పొందవచ్చు.

## ఫోన్ చేయండి!

### 'పల్లెసృజన'లో

ప్రచురించిన వ్యాసాలను గూర్చి ఏవైనా వివరాలు కావలసిన వారు, గ్రామీణ ఇన్నోవేషన్లకు సంబంధించిన ఇతర సమాచారం కోసం ఈ క్రింది చిరునామాకు ఉత్తరం వ్రాసి కాని, లేదా క్రింద తెలిపిన నెంబర్లకు ఫోన్ చేసి కాని తెలుసుకోవచ్చు. లేదా ఈ-మెయిల్ ద్వారా కూడా మీకు కావలసిన సమాచారాన్ని పొందవచ్చు.

**- ఎడిటర్.**

**బ్రిగేడియర్ పి. గణేశం**

**ఎడిటర్‌పల్లెసృజన**

**102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,**

**సికింద్రాబాద్ - 500 094.**

**ఫోన్ : 040-27118555**

**సెల్ : 98660 01678**

E-mail : honeybeeap@gmail.com

## గమనిక

గత సంచికలో చిత్తూరుజిల్లావాసి, ఇన్నోవేటర్ 'పవన్' ఫోన్ నెంబర్ **99589 45143** అని ముద్రించబడినది. ఆ ఫోన్ నెంబర్ : **99598 45143** గా సవరించుకొనగలరు. అసౌకర్యానికి క్షంతవ్యులం. - ఎడిటర్

## గ్రామీణ సృజనాత్మక శక్తి వేదిక 'పల్లెసృజన'

పల్లెసృజన ఒక వేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. ప్రతి సంచికలో ఉత్తమ ఎంట్రీకి ఉచిత వార్షిక సభ్యత్వం ఇవ్వబడుతుంది. మీ సమస్యలను "పల్లెసృజన"లో ప్రచురిస్తాం. వాటి సమాధానాలు పాఠకులు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. మీరంతా సహకరించి ఈ గ్రామీణ సృజనాశక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం.

**-సంపాదకవర్గం.**

# స్పందన

ఎడిటర్ గారికి,

నేను కొత్తగా 'పల్లెసృజన' చందాదారునిగా చేరాను. పత్రికలో ప్రతి ఆర్టికల్ అమూల్యమైనది. పల్లెల్లో దాగివున్న సృజన పెద్ద పెద్ద శాస్త్రవేత్తలకన్న ఎక్కువ అని నేను భావిస్తున్నాను. నేను ఒక సూచన చేస్తున్నాను. మనదేశంలో పల్లెల్లో ఉపాధి కరువై వేలాదిమంది యువకులు ఉద్యోగాల కొరకు పట్టణాలకు వలస వస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో లక్ష రూపాయలలోపు చిన్న చిన్న కుటీర పరిశ్రమలు కాని, చిన్నతరహా పరిశ్రమలు కాని పెట్టుకునే విధంగా పరిశ్రమల వివరాలను మన 'పల్లెసృజన'లో ప్రచురించండి. అలాగే హైదరాబాద్ లాంటి నగరంలో అనేక యువకులు చిన్న పరిశ్రమలు పెట్టుకొని స్వయం ఉపాధి పొందుతున్నారు. అలాంటి యువకుల పరిశ్రమల వివరములను పల్లెసృజనలో ప్రచురిస్తే రాష్ట్ర వ్యాప్తంగా వున్న యువకులకు ఒక మార్గం చూపించినవారు అవుతారు. సూచన పాటిస్తారని ఆశిస్తూ.... **– కె. నగేష్.**

శ్రీ నగేష్ గారికి,

మీ సలహా ఎంతో అమూల్యమైనది. కుటీర పరిశ్రమలను గ్రామాల్లోని నిరుద్యోగులైన యువతకు సంధానం చేసే మీ ఆలోచన మేం తప్పకుండా అమలు చేయడానికి శ్రాయశక్తులా ప్రయత్నం చేస్తాం. మీ టెలిఫోన్ నెంబరు మాకు తెలియజేస్తే మీతో మాట్లాడే అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నాం. మీ ప్రశంసలే మా ఊపిరి. మీ స్పందనకు మా కృతజ్ఞతలు. **– ఎడిటర్.**

ఎడిటర్ గారికి,

పల్లెసృజన అక్టోబర్ – డిసెంబర్ సంచిక మాకు అందినందుకు ధన్యవాదములు. కవర్ పేజి కంటికి ఇంపుగా వుంది. కారాకొల్లు గ్రామవాసులైన చంద్రశేఖర నాయుడు, బత్తినాయుడు, చిరంజీవి గార్లకు మా ధన్యవాదములు. గ్రామీణ శాస్త్రవేత్తలు ఇంతటి విజయాన్ని సాధించడం చాలా ఆనందంగా వుంది. వారికి మా ధన్యవాదములు తెలియజేయగలరు.

**– ఎల్.యస్.యన్. రెడ్డి,** గ్రామీణ వికాస సమితి, తిరుపతి.

## పల్లెజ్ఞానాన్ని వ్యాపింపజేద్దాం - 'పల్లెసృజన'ను బహూకరిద్దాం

### మీవాళ్ళకు మీరిచ్చే అత్యుత్తమ బహుమతి 'పల్లెసృజన'

- మీ నాన్నగారి పుట్టినరోజా?
- మీ స్నేహితుడి పెళ్ళా?
- మీ సహోద్యోగి రిటైరవుతున్నారా?
- శ్రీ మీ పిల్లలు ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యారా?

పెళ్ళైనా, పండగైనా, స్కూళ్ళు కాలేజిలో చేరినా..... సందర్భం ఏదైనా ఆచారం సాంప్రదాయం ప్రకారం ప్రతి సందర్భంలో ఓ బహుమతి ఇవ్వాలి.... దానికెంత ఖర్చు చేయాలి?.... అసలు బహుమతి ఏమివ్వాలి?... ఎప్పుడూ పెద్ద సమస్యే....

- ఇచ్చిన బహుమతి ఆ సందర్భంలోనే ఆనందాన్ని పంచేదిగా కాకుండా...
- అందరూ ఇచ్చిన దానికన్నా భిన్నంగా ....
- జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని పంచేదిగా ఉండాలంటే.....?

ఇచ్చినవారికే కాక, నలుగురికీ పనికి వచ్చే విధంగా ఉండాలి. మీరో పదిమంది మిత్రులకు కాని, శ్రేయోభిలాషులకు గాని 'పల్లెసృజన' పత్రికను 'గిఫ్ట్'గా ఇవ్వాలంటే వారి పేరు, అడ్రస్‌ను వ్రాసి, రూ. 1,000/–లను పంపితే మీరు పంపిన చిరునామాలకు మీ గిఫ్ట్‌గా, మీ పేరున వారికి పంపుతాం. అంటే మీరు ఒక సంవత్సరం పాటు వారికి గిఫ్ట్ ఇచ్చినట్లవుతుంది. ప్రతి సంచిక వచ్చినప్పుడల్లా మమ్మిల్ని జ్ఞాపకం చేసుకుంటారు.

'పల్లెసృజన' పత్రిక మన పల్లెల్లో మారుమూల ప్రాంతాల్లో దాగున్న విజ్ఞాన సంపదని వెలికి తీసి ప్రస్తుత నవ సమాజానికి ఉపయోగపడే విధంగా చేయటానికి పాటుపడుతోంది.

మీరు బహుమతి ఇవ్వదలచుకున్న ప్రతి సందర్భంలో తడుముకోవలసిన అవసరం లేకుండా ఇవ్వదలచుకున్న వారి పేరు, పూర్తి చిరునామాలతో పాటు ఎంతమందికి బహుమతి ఇవ్వాలనుకున్నారో అన్ని రూ. 100/–లు మాకు పంపిస్తే మేము మీ తరుపున వారికి ఒక సంవత్సరం పాటు 'పల్లెసృజన' పత్రికను పంపుతాం. -ఎడిటర్

మీ చందాలు, చిరునామాలు పంపవలసిన చిరునామా : **పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27118555.**

# ఆర్గనైజేషన్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ సోషల్ డైమెన్షన్స్ ఆఫ్ హెల్త్ (ఓపియస్‌డిహెచ్)

## ఎండల్లో ఆరోగ్యం

పాఠకులకు నమస్సులు

ఎండలు మండిపోతున్నాయి.

**ఎండల్లో మనకొచ్చే ఆరోగ్య సమస్యలు :**

❀ వడదెబ్బ

❀ వేడివల్ల అలసట

❀ వేడివల్ల కండరాల నొప్పులు

❀ చెమటకాయలు

❀ నీటి కాలుష్యపు వ్యాధులు : నీళ్ళ విరేచనాలు, చీము రక్త విరేచనాలు, కలరా, టైఫాయిడ్, అమీబియాసిస్, కొన్ని రకాల పచ్చ కామెర్లు, నులిపురుగుల వ్యాధులు మరియు పోలియో.

**ఎండల్లో ఆరోగ్యంగా ఉండాలంటే.....**

❀ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వీలైతే ఎండలో ఎక్కువగా తిరగరాదు.

❀ వదులుగా ఉండే నూలు బట్టలు ఎక్కువగా ధరించాలి.

❀ బయటికి పోయినప్పుడు టోపి కాని, గొడుగు కాని వాడాలి.

❀ మంచినీరు ఎక్కువగా తాగాలి.

❀ సాధారణంగా లభించే నీటితో తరచుగా స్నానం చెయ్యాలి.

❀ నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

❀ ఆరోగ్య కార్యకర్తల సహాయంతో మంచినీటి వనరులను క్లోరినేట్ చేయించుకోవాలి.

❀ వడగట్టి, కాచి, చల్లార్చిన నీరు తాగడం మంచిది.

❀ ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప స్నానానికి వేడినీరు అవసరం లేదు.

ఈ అంశాలు మీ స్నేహితులతో, బంధువులతో, సహచరులతో మాట్లాడండి

సదా మీ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ

– ఓపియస్‌డిహెచ్.

## ఓపియస్‌డిహెచ్ వారి ఆరోగ్యసూత్రాలను వివిధ గ్రామాల్లో కార్యకర్తలు ప్రచారం చేస్తున్న బోర్డులు











# వ్యవసాయంలో పనికిరాని వ్యర్థాలనుంచి గ్యాస్ ఉత్పత్తి

రాజస్థాన్‌లోని హన్‌మాన్‌ఘడ్ జిల్లావాసి 'రాయ్‌సింగ్ ఢైయా' వ్యవసాయంలోని పనికిరాని వ్యర్థాల నుంచి గ్యాస్‌ను ఉత్పత్తి చేసే పరికరాన్ని కనుగొన్నాడు. దీనికై అతను వ్యవసాయంలో పనికిరాని పదార్థాలైన చిన్న చిన్న చెక్కముక్కలు, పైర్ల కాడలు, పైర్లలో పనిరాకుండా పారవేసే వ్యర్థాలను ఉపయోగించి ఇంజన్‌లు, స్టవ్‌లు, కొలిమి వంటివాటిలో వినియోగానికి అవసరమైన మండే గ్యాస్‌ను ఉత్పత్తి చేశాడు. ఈ వ్యర్థాలను ఒక గ్యాసిఫయర్ (ఒక డ్రమ్ములాంటి)లో ఉంచి తగు ఉష్ణోగ్రతలో వేడి చేయాలి. అప్పుడు దీనిలోనుంచి గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. ఈ ఉత్పత్తి అయిన గ్యాస్‌ను ఇంజన్‌లు, స్టవ్‌లు, కొలిమి వెలిగించుకోవటానికి ఉపయోగించాడు.

వ్యవసాయ వ్యర్థాలు అధికంగా ఉండి, విద్యుత్తుకై ఇబ్బంది పడుతున్న గ్రామీణ ప్రాంతాల్లో, ఈ యంత్రం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. 30 హెచ్.పి. హార్స్‌పవర్ గల ఇంజన్‌ను ఒక గంట నడపటానికి అవసరమైన గ్యాస్‌కై 20 కిలోల వ్యవసాయ వ్యర్థాలు అవసరమౌతాయి.

**ముఖ్య లక్షణాలు :**

1. విద్యుత్తు ప్రసారం లేనపుడు నిరంతర విద్యుత్ ప్రసారానికై దీనిని ఉపయోగించవచ్చు.
2. వ్యవసాయ వ్యర్థాలను కూడా ఉపయోగకరంగా వాడుకొనవచ్చును.
3. చిన్న మార్పుతో ఎక్కువ ఉపయోగకరమైన ఫలితాలను సాధించవచ్చు.
4. వాడిన పాత డీజిల్ ఇంజన్‌లను చిన్న మార్పులతో తిరిగి వాడకంలోకి తీసుకురావచ్చు.
5. తక్కువ వినియోగ ఖర్చుతో ఎక్కువ లాభాలను పొందవచ్చు.
6. వేర్వేరు అవసరాలకోసం వివిధ సామర్థ్యాలు కలిగిన యంత్రాలు ఉన్నాయి.

**ఉపయోగాలు :**

1. దూరంగావున్న పొలాలు, ఇళ్ళల్లో పంపుసెట్ల ద్వారా నీటిని తోడుకోవచ్చు.
2. పిండిమరలు, రంపపు యంత్రాలను నడుపుకోవచ్చు.
3. విద్యుత్తుకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకోవచ్చు.

నేషనల్ ఇన్నోవేషన్ సంస్థ దీని పేటెంట్‌కై నమోదు చేసింది.



**పూర్తి వివరాలకై సంప్రదించండి :**


**Lalmuanzuala Chinzah**
NC, Business Development,
NIF - Ahmedabad.
E-mail : bd@nifindia.org
info@nifindia.org
Ph. : 91-79-26753501
26732095/456
Fax : 91-79-26731903

Banlaw No. 1,
Satellite Complex,
Jodhpur Tekra,
Premchand Nagar Road,
Ahmedabad - 380 015.
website : www.nifindia.org/bd

# పల్లెసృజన

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

**పాత సంచికలు కావాలా?**

ఒక్కో సంచిక

**రూ. 20/-లు మాత్రమే!**


సంపుటి 1, సంచిక 1


సంపుటి 1, సంచిక 2


సంపుటి 1, సంచిక 3


సంపుటి 1, సంచిక 4


సంపుటి 2, సంచిక 1


సంపుటి 2, సంచిక 2


సంపుటి 2, సంచిక 3


సంపుటి 2, సంచిక 4


సంపుటి 3, సంచిక 1


సంపుటి 3, సంచిక 2


సంపుటి 3, సంచిక 3


సంపుటి 3, సంచిక 4


సంపుటి 4, సంచిక 1


సంపుటి 4, సంచిక 2


సంపుటి 4, సంచిక 3

**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 150/- | 1,500/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 250/- | 2,500/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 375/- | 3,750/- |
| ఐదు సంవత్సరాలకు (నాలుగు పాత సంచికలు ఉచితం) | 650/- | 6,500/- |

పల్లెసృజన చందాదారులు కండి - పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి! చందాదారులుగా చేరాలనుకున్న వారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ. లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27118555, సెల్ : 9866001678
E-mail : honeybeeap@gmail.com

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి

మీ చిరునామాను స్పష్టంగా వ్రాసి మాకు పంపండి, లేదా యస్.యం.యస్. లేదా ఈ-మెయిల్ చేయండి.

M/s Aruna Ganesham, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
A/c No. 905 520 100 773 62

Narendra Graphics, Hyd. Ph. : 93913 75655